www.trinetnews.com

# ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 81 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు సోమవారం అక్టోబర్ 26, 2026 పేజీలు:12 వెల.10/-

### సైకిల్‌పై ఇంటింటికీ.. డెలివరీ ఏజెంట్‌కు అనంత్ అంబానీ ఊహించని కానుక!



2లో

# ఆర్థిక వ్యవస్థలపై దాడులతోనూ యుద్ధాలు

- యుద్ధాలు ఆయుధాలతోనే కాదు.. ఆర్థిక వ్యవస్థలపైనా జరుగుతున్నాయని ప్రధాని వ్యాఖ్య.
- సైబర్ దాడులతో దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరచవచ్చని వెల్లడి.
- భారత బ్యాంకింగ్ వ్యవస్థకు సైబర్ భద్రత కీలకమని స్పష్టం.
- సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదుల నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలను కాపాడుకోవాలని పిలుపు.
- పాత పద్ధతులతో కొత్త సవాళ్లను ఎదుర్కోలేమని వ్యాఖ్య.
- ఒడిశాలో రూ.169 కోట్లతో ఆర్బీఐ డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణా కేంద్రం ప్రారంభం.
- 2014 తర్వాత సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని మోదీ వెల్లడి.



ప్రస్తుతం యుద్ధాలు సంప్రదాయ విధానాల్లోనే కాకుండా ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని కూడా జరుగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే, భారత బ్యాంకింగ్ రంగం ప్రపంచంలోనే అత్యంత సమర్థమంతమైనదన్నారు. ఈ క్రమంలో సైబర్ ఉగ్రవాదుల నుంచి మన బ్యాంకింగ్ వ్యవస్థలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒడిశాలో రూ.169 కోట్లతో ఆర్బీఐ డేటా సెంటర్ , సైబర్ సెక్యూరిటీ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.

"నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగడం లేదని అందరికీ తెలుసు. ఆర్థిక వ్యవస్థపై దాడులతో దేశాన్ని బలహీనపరచవచ్చు. ఇటీవల సైబర్ ముప్పులు వివరీతంగా పెరిగాయి. భారత్ ఆర్థికంగా బలోపేతం అవుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు, సైబర్ ఉగ్రవాదుల నుంచి మన బ్యాంకింగ్ వ్యవస్థను రక్షించుకోవడం అంతే కీలకంగా మారింది. కాలం చెల్లిన వ్యవస్థలు, పాత పద్ధతుల్లో కొత్త సవాళ్లను ఎదుర్కోలేం. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో బ్యాంకింగ్ సదుపాయాలు కేవలం కొంతమంది ధనవంతులు, ప్రముఖులకే అందుబాటులో ఉండేవని.. వాళ్లకే రుణాలు తేలికగా లభించేవని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళలతోపాటు పేదలు, మధ్యతరగతికి చెందిన వాళ్లకు ఆ సౌకర్యాలు లభించేవి కావన్నారు. 2014 తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, అందరికీ అందుబాటులో ఉండే విధానాలను తీసుకొచ్చామన్నారు. గతంలో క్రెడిట్, డెబిట్ కార్డులు సామాన్యులకు విలాసవంతమైన వస్తువులుగా ఉండేవని, ఇప్పుడు మాత్రం అందరికీ అందుబాటులో ఉన్నాయన్నారు.

# కాంగ్రెస్ దిగజారుడుతనానికి ఖర్గే వ్యాఖ్యలే నిదర్శనం

- ప్రధాని మోదీపై ఖర్గే వ్యాఖ్యలను ఖండించిన బండి సంజయ్.
- మోదీ వ్యక్తిగత జీవితం, కుటుంబంపై విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్య.
- మోదీ చిన్ననాటి పేదరికాన్ని ఎగతాళి చేయడం దారుణమని మండిపాటు.
- రాజకీయాల్లోకి మోదీ తల్లిదండ్రులను లాగడం తగదని హితవు.
- ప్రజలకు చెప్పుకోవడానికి ఏమీ లేకే కాంగ్రెస్ అవమానకర వ్యాఖ్యలు చేస్తోందని విమర్శ.
- మోదీ కుటుంబంపై విమర్శలను దేశ ప్రజలు అంగీకరించరని వ్యాఖ్య.
- ఖర్గే దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బండి సంజయ్ డిమాండ్.



హైదరాబాద్:
ప్రధాని మోదీపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి ఖర్గే వ్యాఖ్యలే నిదర్శనమని మండిపడ్డారు." మోదీ వ్యక్తిగత జీవితం, కుటుంబాన్ని విమర్శలకు వాడుకోవడం దుర్మార్గం. ఆయన చిన్నతనంలో ఎదుర్కొన్న పేదరికాన్ని ఎగతాళి చేయడం దారుణం. మోదీ తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసి రాజకీయాల్లోకి లాగడం నీచం. ప్రజలకు చెప్పుకోవడానికి ఏమీ లేకే కాంగ్రెస్ పార్టీ అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తోంది. మోదీ కుటుంబంపై దాడులను దేశ ప్రజలు ఎన్నటికీ అంగీకరించరు. దేశ ప్రజలకు ఖర్గే బేషరతుగా క్షమాపణలు చెప్పాలి" అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్టు



విశాఖపట్నం సమీపంలోని గంగవరం బీచ్ సుందర దృశ్యాలకు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఫిదా అయ్యారు. దేశంలో ఎక్కువ మంది మాట్లాడుకునే తీరప్రాంత ప్రదేశాల్లో ఎందుకు లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఇది మనకు తెలిసిన కొబ్బరి చెట్లు, పచ్చదనం దృశ్యాలు కనిపించే సాధారణ బీచ్ లాంటిది కాదు. ఎత్తయిన రాతి కొండలతో కఠినమైన, ఒకవిధమైన పురాతన అందం ఇక్కడ కనిపిస్తోంది.

2లో




## సన్నబియ్యం సరఫరాలో అక్రమాలు.. సీఐడీ అదుపులో రైస్ మిల్లుల యజమానులు

హైదరాబాద్:
సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించి భారీగా అక్రమాలకు పాల్పడటంతో పాటు రైస్ మిల్లుల్లో భారీగా బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించి రైస్ మిల్లర్లపై సీఐడీ పోలీసులు కొరడా ఝుళిపించారు.

## చెన్నూరును రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా: మంత్రి వివేక్ వెంకటస్వామి

మంచిర్యాల జిల్లా:
చెన్నూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంతో పాటు యువత, మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.



2లో..

## ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ముగ్గురి మృతి

మంచిర్యాల జిల్లా:
జైపూర్ మండలం ఇందారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు చెరువులో పడి ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఒక బాలిక, ఇద్దరు మహిళలు ఉన్నారు. మృతి చెందిన వారు సంచార జాతులకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు.
దుస్తులు ఉతకడానికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదవశాత్తు బాలిక చెరువులో పడడంతో ఆమెను కాపాడబోయి మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## ఖాళీగా వరంగల్ ఏసీపీ పోస్టు.. పర్యవేక్షణ కరువు!

- ఆరు నెలలుగా పూర్తిస్థాయి ఏసీపీ నియామకం లేదు.
- 2026 ఏప్రిల్‌లో నగ్రాలె శుభమ్ ప్రకాశ్ బదిలీతో ఖాళీ అయిన పోస్టు.
- హనుమకొండ ఏసీపీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు.
- మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ ఠాణాలపై పర్యవేక్షణ లోపించిందన్న విమర్శలు.
- వరంగల్ తూర్పులో రాజకీయ గ్రూపు తగాదాలతో అధికారులకు ఇబ్బందులు.
- పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస నేర ఘటనలు, శాంతిభద్రతల సమస్యలు.
- ఏసీపీ పోస్టు భర్తీపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి.




2లో

వరంగల్:
వరంగల్ పోలీస్ సబ్ డివిజన్‌కు గ్రహణం పట్టింది. ఏసీపీ పోస్టు ఖాళీ అయ్యి ఆరు నెలలు దాటినా ఇప్పటివరకు ఇక్కడ పూర్తిస్థాయి అధికారిని నియమించకపోవడం పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్న విమర్శలున్నాయి.

## యూనిక్ కంపెనీ పెట్టుబడుల మోసం.. రూ.28 కోట్ల టోకరా?




- కరీంనగర్‌లో భారీ పెట్టుబడుల మోసం ఆరోపణలు!
- యూనిక్ కంపెనీ పేరుతో ప్రజల నుంచి భారీగా పెట్టుబడుల సేకరణ.
- నెలవారీ పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్ పేరుతో ఆకర్షణ.
- కరీంనగర్ జిల్లాలో రూ.26--28 కోట్ల వరకు మోసం జరిగినట్లు ప్రాథమిక అంచనా.
- 2019లో గడువు ముగిసినా పెట్టుబడులు తిరిగి చెల్లించలేదని బాధితుల ఆరోపణ.
- 2020లో కంపెనీ కార్యకలాపాలు నిలిపివేసినట్లు సమాచారం.
- కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు.
- బాధితులు పోలీస్ స్టేషన్ లేదా కరీంనగర్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి.

2లో

## నాగరాజు.. నకిలీ పోలీసు



2లో..

హైదరాబాద్:
సినిమా స్టోరీని తలపించేలా పోలీస్ ఆఫీసర్ అవతారమెత్తి గన్‌లతో కిడ్నాప్‌లు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్, డేంజరస్ క్రిమినల్‌పై సైబరాబాద్ కమిషనర్ ఎం రమేష్ ఉక్కుపాదం మోపారు. ఐదు రకాల దొంగ పేర్లతో చెలామణి అవుతూ పదేపదే నేరాలకు పాల్పడుతున్న నాగారాజు రఘు వర్మ (29)పై శనివారం పీడీ చట్టాన్ని ప్రయోగించారు. ఇతనిని గూండాగా ప్రకటిస్తూ.. చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు.

**డ్రైవర్ నుంచి.. క్రైమ్ సామ్రాజ్యానికి..**

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు



## ఎర్రవల్లిలో భూ సర్వే.. రైతుల కబ్జాలో 343 ఎకరాలు!

2లో..

ఎర్రవల్లి:
ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఎర్రవల్లి గ్రామంలోని 325 సర్వే నంబర్‌లో భూముల సర్వే నిర్వహించిన అధికారులు, రైతుల కబ్జాలో 343 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు.



## చిల్లర కోసం గొడవ.. కదులుతున్న బస్సులోంచి కండక్టర్‌ను తోసేసిన మహిళ!

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన
- చిల్లర విషయంలో ప్రయాణికురాలు, మహిళా కండక్టర్ మధ్య వాగ్వాదం.
- బాలుడి టికెట్ విషయంలో మొదలైన వివాదం.
- అశ్వాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తుండగా ఘటన.
- కదులుతున్న బస్సు నుంచి కండక్టర్‌ను తోసివేసిన ప్రయాణికురాలు.
- బస్సు వెనుక చక్రాల కింద పడి కండక్టర్‌కు తీవ్ర గాయాలు.
- భద్రాచలం ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు.
- ప్రయాణికురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.

2లో

## రామంతపూర్‌లో భారీ పేలుడు



రామంతపూర్ చర్చ్ కాలనీలో భారీ పేలుడు సంభవించింది. స్క్రాప్ షాపులో లోహాన్ని కట్ చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు జరిగింది. పేలుడు తర్వాత షాపులో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో స్క్రాప్ డీలర్ పరశురామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.బాధితుడిని అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి శరీరంలో సుమారు 70 శాతం కాలినట్లు సమాచారం. పరశురామ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలానికి చేరుకున్న రెండు అగ్నిమాపక వాహనాలు.. మంటలను అదుపులోకి తెచ్చాయి.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిర్భీతి
తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబర్ 26, 2026
www.trinetnews.com

# యూనిక్ కంపెనీ పెట్టుబడుల మోసం.. కరీంనగర్ లో రూ.28 కోట్ల వరకు టోకరా?

మొదటిపేజీ తరువాయి

యూనిక్ కంపెనీ పేరుతో పెట్టుబడులు సేకరించి, తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. యూనిక్ మెర్కంటైల్, స్వయం మల్టీస్టేట్ సొసైటీల పేరుతో వివిధ పెట్టుబడి పథకాలను నిర్వహిస్తూ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో నగదు సేకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

నెలవారీ పెట్టుబడి పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, హోటల్ ప్యాకేజీల పేరుతో ప్రజలను ఆకర్షించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏజెంట్లు, ప్రాంతీయ ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించిన వ్యక్తుల ద్వారా పలు జిల్లాల్లో పెట్టుబడులు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. కరీంనగర్ జిల్లాలో ఈ వ్యవహారానికి సంబంధించి సుమారు రూ. 26 కోట్ల నుంచి రూ. 28 కోట్ల వరకు మోసం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో అంచనా వేసినట్లు సమాచారం.

2019లో వివిధ పెట్టుబడి పథకాల గడువు ముగిసినప్పటికీ, పెట్టుబడిదారులకు వారి సొమ్మును తిరిగి చెల్లించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అనంతరం కోవిడ్ కారణంగా నష్టాలు వచ్చాయనే పేరుతో 2020లో కంపెనీ కార్యకలాపాలను నిలిపివేసినట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న రాజ్ కుమార్ కైలాష్ రాయ్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు.

ప్రస్తుతం ఆయన ఆదిలాబాద్ జైలులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి గుడిపాటి గాంధీ, మాకలసోంపల్లి కరియప్ప, ఉల్లిగడ్డల సంగప్ప, కొమిరె భూమా గౌడ్, యేదెళ్ల రమేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ పెట్టుబడుల పథకాలలో డబ్బులు పెట్టి నష్టపోయిన బాధితులు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా కరీంనగర్ క్రైమ్ కంట్రోల్ సెల్ (సీసీఎస్)లో ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఖాళీగా వరంగల్ ఏసీపీ పోస్టు

మొదటిపేజీ తరువాయి

గతంలో ఇక్కడ పనిచేసిన యువ ఐపీఎస్ అధికారి నగ్రాలె శుభమ్ ప్రకాశ్.. 2026 ఏప్రిల్‌లో నిజామాబాద్ అదనపు డీసీపీగా బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం హనుమకొండ ఏసీపీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినప్పటికీ ఆయన తన సొంత డివిజన్‌ను చూసుకుంటూ ఇక్కడికి పూర్తి సమయం కేటాయించలేకపోతుండడంతో ఇన్‌చార్జ్ పాలన అంతంతమాత్రంగానే సాగుతోంది. ఫలితంగా వరంగల్ పోలీసు డివిజన్ కిందికి వచ్చే మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ ఠాణాల్లో నేర ఘటనలపై పర్యవేక్షణ కరువైందన్న విమర్శలున్నాయి.

**రాజకీయ వైషమ్యాలు.. గ్రూపుల తగాదాలు**

ఏసీపీ బాధ్యతలు చేపట్టేందుకు సీనియర్ ర్యాంకర్ అధికారులు, సీఐలుగా పనిచేసి పదోన్నతి పొందిన వారు పెద్దగా ఆసక్తి చూపకపోవడానికి వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రాజకీయ వైషమ్యాలే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇక్కడ అధికార పార్టీలోనే అంతర్గతంగా గ్రూపులు ఉండడం, ఒకవర్గం చెప్పినట్లు వింటే మరోవర్గం ఒత్తిడి తేవడం వంటి పరిణామాలతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ చిన్న తప్పు జరిగినా నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్తుండడంతో ఈ రాజకీయ చదరంగంలో తాము బలికాకూడదనే ఉద్దేశంతో సమర్థులైన అధికారులు సైతం ఈ పోస్టుకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

**మూడు ఠాణాల పరిధిలో కరువైన పర్యవేక్షణ**

వరంగల్ డివిజన్ పరిధిలోని మూడు కీలక పోలీసు స్టేషన్లయిన ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ, మిల్స్ కాలనీలపై ఏసీపీ స్థాయి పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. ఆయా స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్య కలాపాలు, శాంతిభద్రతల సమస్యలు నానాటికీ పెచ్చుమీరుతున్నాయన్న విమర్శలున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో నిఘా కరువవడంతో ఓ వ్యక్తి పీఎస్ లోపలే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోగా, మరో వ్యక్తి స్టేషన్ సమీపంలోనే డీజిల్ పోసుకుని బలవన్మరణానికి యత్నించడం సంచలనం సృష్టించింది.

కరీమాబాద్ ప్రాంతం బీరన్నకుంటల్లో బర్త్‌డే సందర్భంగా యువకులు తల్వార్ తిప్పుతూ బైక్‌పై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. అంతకుముందే ఇక్కడి ఓ ఎస్సైపై అవినీతి ఆరోపణలు రావడంతో సీపీ సస్పెండ్ చేశారు. అలాగే, ఇంతేజార్‌గంజ్ పరిధిలో యువతను, మైనర్లను టార్గెట్ చేస్తూ వారికి గంజాయి అలవాటు చేసి వ్యభిచార ఊబిలోకి దించుతున్న అంతర్రాష్ట్ర ముఠాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేయడం కలకలం రేపింది. మట్టెవాడ ఠాణా పరిధిలో ఇంట్లో పని మనుషులుగా కుదిరి ఓ రిటైర్డ్ ప్రభుత్వోద్యోగిని హత్యచేసిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇలా ఏదో రూపంలో ఘటనలు జరుగుతుండడంతో వాటిపై పర్యవేక్షణకు ఏసీపీ అవసరం కనిపిస్తోంది.

**క్రైమ్ రేటు కట్టడికి అవసరమే..**

నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. కీలక ప్రాజెక్టులు నడుస్తున్నాయి. ముఖ్యంగా కొత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కూడా త్వరలో ప్రారంభం కానుంది. వరంగల్ మోడ్రన్ బస్టాండ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కీలకమైన రైల్వే స్టేషన్ ఉంది. బంగారు దుకాణాలు, బట్టల దుకాణాల హోల్‌సేల్ వ్యాపారం ఉంది. భూ కబ్జాల కేసులు వెలుగులోకి వస్తున్నాయి. వాటిన్నింటిని దృష్టిలో ఉంచుకొని క్రైమ్ రేటును కట్టడి చేసేందుకు వరంగల్ ఏసీపీ పోస్టు భర్తీ ఎంతో కీలకం కానుంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వరంగల్ వాసులు కోరుతున్నారు.

# చెన్నూరును రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా: మంత్రి వివేక్ వెంకటస్వామి

మొదటిపేజీ తరువాయి

మంచిర్యాల జిల్లా మందమర్రిలోని సమ్మక్క సారలమ్మ మహిళా భవనాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి, మీఊూ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై మాట్లాడారు.

**మహిళలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ**

మహిళా సంఘాల సభ్యులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ అందించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా సహకరిస్తామని మంత్రి తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలు అందుబాటులో ఉన్న శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**యువతకు జర్మన్ భాషలో శిక్షణ**

మందమర్రిలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా యువతీ యువకులకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. దీనివల్ల భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువతకు అవకాశం కలుగుతుందని తెలిపారు. అలాగే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చెన్నూరు నియోజకవర్గంలో మరిన్ని శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివేక్ వెంకటస్వామి వివరించారు. యువత, మహిళలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ పాలనపై మంత్రి విమర్శలు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శలు చేశారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల వల్లే తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారిందని ఆరోపించారు. సుమారు రూ. 1.50 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని వ్యాఖ్యానించారు.

ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు 22 ఎకరాల భూమి ఉండేదని, ప్రస్తుతం ఎర్రవెల్లిలో 300 ఎకరాల భూములు ఎలా వచ్చాయో తెలంగాణ ప్రజలకు వివరించాలని మంత్రి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని పేర్కొన్నారు.

**ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

చెన్నూరు నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ అందించడం, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా స్థానికంగా ఉపాధిని పెంచేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఎర్రవల్లిలో భూ సర్వే.. రైతుల కబ్జాలో 343 ఎకరాలు!

మొదటిపేజీ తరువాయి

మరో 45 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

సర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా భూముల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

**భూముల వివరాల సేకరణపై అధికారుల దృష్టి**

ఎర్రవల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నంబర్‌లో భూముల హద్దులు, విస్తీర్ణం, ప్రస్తుత ఆక్రమణలకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే 343 ఎకరాల భూమి రైతుల కబ్జాలో ఉన్నట్లు గుర్తించగా, మరో 45 ఎకరాలకు సంబంధించి లెక్కలు తీస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత భూముల స్థితిగతులపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడటంతో పాటు, అసైన్డ్ భూముల పరిరక్షణకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. ప్రభుత్వ భూములపై హక్కులు లేనివారు ఆక్రమణలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూముల గుర్తింపు, హద్దుల నిర్ధారణ, ఆక్రమణల వివరాల సేకరణ వంటి చర్యల ద్వారా భూములను పరిరక్షించేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు.



# సైకిల్‌పై ఇంటింటికీ.. డెలివరీ ఏజెంట్‌కు అనంత్ అంబానీ ఊహించని కానుక!

మొదటిపేజీ తరువాయి

బైక్ కొనే స్తోమత లేక.. సైకిల్‌పై ఇంటింటికీ తిరుగుతూ డెలివరీలు చేస్తున్న ఓ గిగ్ వర్కర్‌కు ఊహించని కానుక లభించింది. అనంత్ అంబానీ తరఫున ప్రతినిధి ఆయనకు ఎలక్ట్రిక్ స్కూటర్‌ను బహుమతిగా అందజేశారు. ఈ క్రమంలోనే తీవ్ర భావోద్వేగానికి గురైన ఆ డెలివరీ ఏజెంట్ కంటతడి పెట్టారు. ముంబయికి చెందిన హుస్సేన్ మన్సూరి అనే ఇన్‌ఫ్లుయెన్సర్ దీనికి సంబంధించి ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. అది కాస్త వైరల్‌గా మారింది.

ముంబయిలో డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న సుజీత్ అనే వ్యక్తి సైకిల్‌పై విధులకు వెళుతుండగా రోడ్డుపై హుస్సేన్ మన్సూరి ఆయన్ను పలకరించారు. బైక్ ఎందుకు కొనుక్కోలేదని అడిగారు. అయితే.. చాలీచాలనీ వేతనంతో బండి కొనుగోలు చేసే శక్తి తనకు లేదని, అన్నింటి ధరలు పెరిగిపోయాయని ఆయన చెప్పారు. అయితే.. నీకో సర్‌ప్రైజ్ ఇస్తానని, డెలివరీ పూర్తి చేసి తిరిగి రావాలని హుస్సేన్ సూచించారు.

అలాగే తిరిగి వచ్చిన సుజీత్ కళ్లకు గంతలు కట్టి కొత్త స్కూటర్ రూపంలో సర్‌ప్రైజ్ ఇచ్చారు. అనంత్ అంబానీ తరఫున చిన్న బహుమతి అని తెలిపారు. దీంతో ఆయన ఆనందంతో ఉప్పొంగిపోయారు. మన్సూరిని హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. 'అనంత్ సేవా ఫౌండేషన్' చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ బహుమతిని అందజేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.

# చిల్లర కోసం గొడవ.. కదులుతున్న బస్సులోంచి కండక్టర్‌ను తోసేసిన మహిళ

మొదటిపేజీ తరువాయి

ప్రయాణికురాలితో చిల్లర కోసం జరిగిన గొడవ ఓ మహిళా కండక్టర్ ప్రాణాల మీదకు తెచ్చిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటు చేసుకుంది. మిట్టగూడెంకు చెందిన ఓ ప్రయాణికురాలు.. మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోనకు చెందిన పల్లె వెలుగు బస్సు ఎక్కారు. ఆమెతో పాటు ఉన్న బాలుడికి టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ సూచించారు.

అందుకు నిరాకరించిన ప్రయాణికురాలు.. కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం బాలుడికి టికెట్ తీసుకునేందుకు అంగీకరించిన ప్రయాణికురాలు కండక్టర్‌కు డబ్బులు ఇచ్చారు. టికెట్ ఇచ్చి దిగేటప్పుడు మిగిలిన చిల్లర తీసుకోవాలని కండక్టర్ చెప్పగా.. అలా కుదరదని, ఇప్పుడే చిల్లర ఇవ్వాలని ప్రయాణికురాలు వాగ్వాదానికి దిగారు. ఈలోగా మిట్టగూడెం స్టాప్ రాగానే ఆమె బస్సు దిగడానికి ప్రయత్నించారు. వాగ్వాదం నేపథ్యంలో మహిళా కండక్టర్ ఆమెను అదే బస్సులో అశ్వాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లడానికి ప్రయత్నించారు. బస్సును ముందుకు నడపాలని డ్రైవర్‌కు సూచించారు. ఈ దశలో ఆ ప్రయాణికురాలు ఆమెను నెట్టివేయడంతో కదులుతున్న బస్సు వెనుక చక్రాల కింద పడిపోయారు. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రయాణికురాలిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎల్లయ్య తెలిపారు.

# సన్నబియ్యం సరఫరాలో అక్రమాలు.. సీఐడీ అదుపులో రైస్ మిల్లుల యజమానులు

మొదటిపేజీ తరువాయి

ములుగు జిల్లాకు చెందిన ఐదుగురు మిల్లర్లను అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బాదం, శ్రీమాత రైస్ మిల్స్ యజమాని బాదం ప్రవీణ్, లేపాక్షి రైస్‌మిల్ యజమాని మోహన్, సాయిరాం రైస్‌మిల్ యజమాని రఘోత్తమ్, వాసవి రైస్‌మిల్ యజమాని శ్రవణ్, ఎల్ఎస్ఆర్ రైస్‌మిల్ యజమాని హరినాథ్‌ను అదుపులోకి తీసుకొని వరంగల్‌లోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని సొంతానికి వాడుకోవడంతో పాటు, బకాయిలు రూ. కోట్లలో పేరుకుపోవడంతో అక్రమాలకు పాల్పడిన మిల్లర్లకు గతంలోనే నోటీసులు జారీ చేశారు.

ఎఫ్‌సీఐకి సన్న బియ్యం బదులు దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడంతో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కేటాయింపులపై సీఐడీ దర్యాప్తు చేపట్టింది. నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో 16 రైస్ మిల్లుల యజమానులు 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు. బోనస్ రూపంలో ప్రభుత్వానికి సుమారు రూ. 1.69 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. మరో 45,414.833 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్‌కు కేటాయించారు. ఈ కేటాయింపులపై బోనస్ పరంగా సుమారు రూ. 242 కోట్ల మేర ప్రభుత్వంపై ఆర్థిక ప్రభావం ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మిల్లర్ల పాత్రతో పాటు అధికారుల ప్రమేయం, కుట్ర కోణంపై సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్టు

మొదటిపేజీ తరువాయి

ఇలాంటి సహజ సౌందర్యమే నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఇక్కడ సేద తీరడమే కాకుండా.. ప్రశాంతంగా కాసేపు ఆత్మపరిశీలన కూడా చేసుకోవచ్చు.

ప్రస్తుతం ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు.. భారీ డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల నిర్మాణానికి వైజాగ్‌కు వస్తున్నాయి. కానీ, ఇక్కడి దృశ్యాలను చూస్తుంటే లక్షల ఏళ్ల క్రితమే ప్రకృతి పెద్దఎత్తున విస్తరణ ప్రక్రియను మొదలుపెట్టినట్లు అనిపిస్తోంది. విశాఖపట్నం ప్రధాన టెక్ హబ్‌గా వేగంగా మారుతోంది. అదేవిధంగా అత్యంత అద్భుతమైన తీరప్రాంత పర్యాటక ప్రదేశంగానూ వెలుగొందే సత్తా దీనికి ఉందని భావిస్తున్నా" అని ఆనంద్ మహీంద్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. నెటిజన్లు ఆయన వ్యాఖ్యలతో ఏకీభవించారు.

# నాగరాజు..నకిలీ పోలీసు

మొదటిపేజీ తరువాయి

మండలానికి చెందిన నాగరాజు రఘు వర్మ కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. తొలుత డ్రైవర్‌గా జీవితాన్ని ప్రారంభించిన ఇతగాడు.. విలాసవంతమైన జీవితాన్ని గడపాలనే కోరికతో నేరాల బాట పట్టాడు. ఈక్రమంలోనే ఖాకీ అవతారమెత్తిన నాగరాజు. తానొక పెద్ద పోలీస్ అధికారిని అంటూ అమాయక బాధితులకు ఎర వేయడం మొదలుపెట్టాడు. బాధితులను టార్గెట్ చేసి, వారిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని నమ్మించేవాడు. 'మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం, చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయి' అని భయభ్రాంతులకు గురిచేసేవాడు. ఆ తర్వాత కేసుల నుంచి కాపాడతామంటూ నమ్మించి డబ్బు వసూలు చేసేవాడు. అంతటితో ఆగకుండా బాధితులను ఏకంగా కిడ్నాప్ చేసి, తుపాకులు చూపించి వారి వద్ద ఉన్న నగదును దోచుకునేవాడు. 2017 నుంచి 2026 మధ్య కాలంలో14 రకాల కేసులలో ప్రధాన నిందితుడు.

**జైలు నుంచి రాగానే మళ్లీ పంజా..**

సాధారణంగా పీడీ చట్టం పడితే నేరస్థుల్లో భయం వస్తుంది. కానీ ఈ ఇతను మాత్రం జైలు నుంచి విడుదలైన ప్రతిసారీ పాత నేరాలనే మరింత స్పీడ్‌గా రిపీట్ చేసేవాడు. జైలు నుంచి బయటకు రాగానే పోలీస్ అధికారిగా నటిస్తూ కిడ్నాప్, దోపిడీలకు సంబంధించిన మరో నాలుగు కొత్త కేసులకు తెరలేపాడు. దీంతో రంగంలోకి దిగిన జగద్గిరిగుట్ట పోలీసులు అత్యంత చాకచక్యంగా ప్లాన్ వేసి ఇతని ఆట కట్టించి, కటకటాల వెనక్కి నెట్టారు. గతంలో రెండుసార్లు (2021, 2024) పీడీ చట్టం విధించినా బుద్ధి మార్చుకోకుండా, సమాజంలో పదేపదే భయాందోళనలు సృష్టిస్తున్న నాగరాజు రఘు వర్మపై సైబరాబాద్ కమిషనర్ మరోసారి పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు.

# నది ఒడ్డున వేలాది ఓటరు కార్డులు

నది ఒడ్డున వేలాది ఓటరు కార్డులు చిందరవందరగా పడి ఉండటం రాజకీయంగా కలకలం రేపింది. ఈ వ్యవహారం మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. అక్కడి నర్మదానది తీరంలోని మండలేశ్వర్ ఘాట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని విసిరేశారు. కాగా.. వాటిలో చాలా కార్డులు ఇందౌర్‌లోని రవూ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్లవి కావడం గమనార్హం. దీనికి సంబంధించి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు, జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కార్డులను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై రాతపూర్వక ఫిర్యాదు కూడా అందినట్లు మహేశ్వర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ వెల్లడించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు మండలేశ్వర్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఓట్లను చోరీ చేసేందుకే పక్కా ప్రణాళిక ప్రకారం అధికార పార్టీ నేతలు ఈ దారుణానికి ఒడిగట్టారని విమర్శించారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఖార్గోన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రవి నాయక్ డిమాండ్

# ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి,,

**-- బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌లోని ఆరు గ్రామ పంచాయతీల్లో 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారం**
**-- రేబాలలో రూ.5.85 కోట్లు, దామరమడుగులో రూ.4.80 కోట్లు, పెనుబల్లిలో రూ.4.17 కోట్లు, కాలయకాగళ్లలో రూ.2.03 కోట్లు, జొన్నవాడలో రూ.1.41 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు**
**-- కాలయకాగళ్లలో రూ.89.99 లక్షలతో కోవూరు కాలువపై వంతెన, పెనుబల్లిలో సాదా బైనామా పట్టాలు, 200 ఎకరాలకు దారి హామీ**
**-- జడ్పీటీసీ అభ్యర్థి ఏటూరు శివరామకృష్ణారెడ్డి గారితో పాటు ఎంపీటీసీ తెలుగుదేశం కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై గెలిపించాలని విజ్ఞప్తి**
**-- స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు అంగీకరించిన టీడీపీ నేత పెంచల ప్రసాద్**

కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు ఆదివారం ఉదయం బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌లోని రేబాల--2, దామరమడుగు--1, దామరమడుగు--2, కాలయకాగళ్లు, పెనుబల్లి, జొన్నవాడ గ్రామ పంచాయతీల్లో 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం జడ్పీటీసీ కూటమి అభ్యర్థి శ్రీ ఏటూరు శివరామకృష్ణారెడ్డి గారితో పాటు ఎంపీటీసీ కూటమి అభ్యర్థులు శ్రీ గోరు రామిరెడ్డి గారు (రేబాల--2), శ్రీమతి దార అన్నపూర్ణ గారు (దామరమడుగు--1), శ్రీమతి మన్నెం సునీత గారు (దామరమడుగు--2), శ్రీమతి పేరం జానకమ్మ గారు (కాలయకాగళ్లు), శ్రీ సన్నపురెడ్డి లక్ష్మయ్య గారు (పెనుబల్లి), శ్రీమతి బూదూరు అరుణ గారు (జొన్నవాడ)లను సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.

### సూపర్ సిక్స్ అమలు.. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో

ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే గారు అన్నారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుకుంటూనే సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచిన పింఛన్‌ను ప్రతి నెలా ఒకటో తేదీన, సెలవు అయితే ముందు రోజే అందిస్తున్నామని, తల్లికి వందనం, స్త్రీ శక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, చేనేత, మత్స్యకార, ఆటో సేవలు అమలవుతున్నాయని తెలిపారు. రైతులకు 16 గంటల విద్యుత్ ఇస్తూ కరెంటు చార్జీలు పెంచకుండా చూస్తున్నామని, 'మీ భూమి మీ హక్కు' పేరుతో రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందించామని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి తవ్వని కాలువల పూడికతీత, కనెక్టింగ్ బ్రిడ్జిలు, రోడ్ల మరమ్మతులు, పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలిన సీసీ డ్రెయిన్లు, రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. 'చేసేశాం' అని చెప్పడం లేదని, చెప్పిన ప్రతి పనినీ ఒకదాని తర్వాత ఒకటి పూర్తి చేస్తున్నామని అన్నారు. జడ్పీటీసీ అభ్యర్థి శ్రీ శివరామకృష్ణారెడ్డి గారు నీతి, నిజాయితీతో, అవినీతి రహితంగా అందరికీ అందుబాటులో ఉండే నాయకుడని పేర్కొన్నారు.

### రేబాలలో రూ.5.85 కోట్ల పనులు



రేబాల పంచాయతీలో ఇప్పటివరకు రూ.5.85 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులు జరిగాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.52.71 లక్షలు, పంచాయతీరాజ్‌లో రూ.1.65 కోట్లు, విద్యుత్ శాఖలో రూ.1.44 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.1.09 కోట్లు వెచ్చించామని, సీఎంఆర్‌ఎఫ్ కింద పేదలకు రూ.13.14 లక్షలు అందించామని చెప్పారు. అధికారంలోకి రాగానే శివరామకృష్ణారెడ్డి గారిని ప్రతిష్టాత్మకమైన బుచ్చి బ్యాంక్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి గారు నియమించారని గుర్తుచేశారు. ఇరవై ఏళ్లుగా తవ్వని కాలువలను తవ్వి రైతులకు అండగా నిలిచామని, నీళ్లు పుష్కలంగా ఇవ్వడంతో రైతులందరికీ నాలుగు పంటలు పండాయని చెప్పారు.

### దామరమడుగులో రూ.4.80 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు

దామరమడుగు పంచాయతీలో ఇప్పటివరకు రూ.4.80 కోట్ల విలువైన పనులు జరిగాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.40 లక్షలతో కాలువ పూడికతీత, మరమ్మతులు పూర్తి చేశామని, రూ.1.18 కోట్లతో మూడు పనులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. పంచాయతీరాజ్‌లో రూ.25.30 లక్షలతో ఐదు సీసీ రోడ్లు, ఆర్‌ఆర్ నగర్‌లోని ముస్లిం బరియల్ గ్రౌండ్ ప్రహరీ, లెవలింగ్ పనులు పూర్తయ్యాయని, రూ.16 లక్షలతో రెండు సీసీ రోడ్లు, దామరమడుగు--1లో విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు జరుగుతున్నాయని, దామరమడుగు--2లో రూ.19 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరైందని తెలిపారు. విద్యుత్ శాఖలో రూ.86.16 లక్షలతో వివిధ పనులు చేపట్టామని పేర్కొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.32.33 లక్షలతో 11 డ్రెయిన్ వర్క్స్, పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని, రూ.14 లక్షలతో మూడు పనులు జరుగుతున్నాయని, రూ.63.90 లక్షల జల్ జీవన్ మిషన్ పనులు మంజూరయ్యాయని చెప్పారు. ఆర్ అండ్ బీ ద్వారా రూ.5 లక్షలతో రెండు ప్యాచ్ వర్క్‌లు పూర్తయ్యాయని, వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ కింద దామరమడుగు జడ్పీ స్కూల్‌కు రూ.30 లక్షలు, ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ లెవలింగ్‌కు రూ.1 లక్ష అందించామని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 37 మందికి రూ.29.82 లక్షలు అందించామని వివరించారు. గత ఎన్నికల్లో దామరమడుగు ప్రజలు చరిత్ర తిరగరాస్తూ తొలిసారి తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని, అందుకు శిరసు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో దామరమడుగును మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

కాలయకాగళ్లలో రూ.2.03 కోట్ల పనులు.. కోవూరు కాలువపై కొత్త వంతెన

కాలయకాగళ్లు పంచాయతీలో ఇప్పటివరకు రూ.2.03 కోట్ల విలువైన పనులు జరిగాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమతి పేరం జానకమ్మ గారి తండ్రి గతంలో సర్పంచ్‌గా పనిచేశారని, ఆ నేపథ్యం చూసి ఆమెను నిలబెట్టామని చెప్పారు. ఇరిగేషన్ శాఖలో రూ.7.50 లక్షలతో పంట కాలువల మరమ్మతులు, రూ.89.99 లక్షలతో కోవూరు కాలువపై వంతెన నిర్మాణం జరుగుతోందని, ఇరవై, ముప్పై ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఈ వంతెన రైతుల రాకపోకలకు, ధాన్యం తరలింపునకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు చెప్పడంతో మంజూరు చేయించామని తెలిపారు. పంచాయతీరాజ్‌లో రూ.15 లక్షలతో మూడు సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు జరుగుతున్నాయని, రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, శ్మశానవాటిక ప్రహరీ పనులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖలో ఆర్‌డీఎస్‌ఎస్ ద్వారా రూ.30.33 లక్షలతో త్రీఫేజ్, 24 గంటల కరెంట్ సరఫరా అందించామని, ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.5.80 లక్షలతో ఆరు సీసీ డ్రెయిన్లు, రూ.13.21 లక్షలతో తాగునీటి పనులు చేశామని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎనిమిది మందికి రూ.6.80 లక్షలు అందించామని చెప్పారు. పల్లె పండుగ 3.0 కింద నియోజకవర్గానికి రూ.11 కోట్లు రాగా, గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్ల మరమ్మతులు చేపడుతున్నామని వివరించారు. గ్రామస్థులు కోరిన ఇతర పనులను వీపీఆర్ ఫౌండేషన్, సీఎస్‌ఆర్ నిధుల ద్వారా మంజూరు చేయించి చేపడతామని హామీ ఇచ్చారు.

### పెనుబల్లిలో రూ.4.17 కోట్ల పనులు.. రైతులకు పట్టాలు, 200 ఎకరాలకు దారి

కోవూరు నియోజకవర్గంలోని 82 పంచాయతీల్లో ప్రతిచోటా పనులు చేశామని చెప్పిన ఎమ్మెల్యే గారు, పెనుబల్లిలో ఇప్పటివరకు రూ.4.17 కోట్ల విలువైన పనులు జరిగాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.52.29 లక్షలతో 10 కాలువల పూడికతీత, మరమ్మతులు చేశామని, రూ.17.27 లక్షలతో రెండు పనులు మంజూరయ్యాయని చెప్పారు. పంచాయతీరాజ్‌లో రూ.23.80 లక్షలతో నాలుగు సీసీ రోడ్లు, రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.26 లక్షలతో ఏడు సీసీ రోడ్లు మంజూరయ్యాయని, రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు, రూ.1.50 కోట్లతో పెనుబల్లి--మినగల్లు రోడ్డు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ శాఖలో టీ అండ్ డీ గ్రాంట్ ద్వారా రూ.11.80 లక్షలతో వివిధ పనులు, ఆర్‌డీఎస్‌ఎస్ ద్వారా రూ.28.06 లక్షలతో త్రీఫేజ్, 24 గంటల కరెంట్ సరఫరా అందించామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.47.72 లక్షలతో 13 సీసీ డ్రెయిన్లు, టీటీడీ భజన మందిరం పథకం కింద ఎస్టీ కాలనీలో వినాయకస్వామి గుడి (భజన మందిరం) నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, ఎన్నికల తర్వాత ఆ పనులు చేపడతామని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ ద్వారా సాల్మాన్‌పురంలో శ్మశానవాటిక ప్రహరీ, లెవలింగ్ పనులకు రూ.10 లక్షలు, తాగునీటి పనులకు రూ.3.20 లక్షలు అందించామని, శ్మశానవాటికను మొత్తం రూ.20 లక్షలతో పూర్తి చేశామని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 10 చెక్కులకు రూ.14.93 లక్షలు అందించామని వివరించారు.

ప్రచారానికి వచ్చినప్పుడు రైతులు చెప్పిన సమస్యల్లో సగమైనా తీర్చామని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే గారు అన్నారు. సాదా బైనామా కింద ఉన్న రైతులకు పట్టాలు ఇప్పిస్తామని ఇచ్చిన మాటకు సంబంధించిన ఫైల్ కలెక్టర్ గారి వద్ద ఉందని, ఎన్నికల తర్వాత ఇస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే రెండు వందల ఎకరాల రైతులకు దారి ఇచ్చి తీరుతామని మాట ఇచ్చారు.

### జొన్నవాడలో రూ.1.41 కోట్ల పనులు.. అవినీతి రహిత కోవూరు దిశగా

జొన్నవాడ కామాక్షి తాయి సాక్షిగా అవినీతి రహిత కోవూరు నియోజకవర్గం చేస్తామని చెప్పామని, అక్షరాలా చేసి చూపించామని ఎమ్మెల్యే గారు అన్నారు. ఈ పంచాయతీలో ఇప్పటివరకు రూ.1.41 కోట్ల విలువైన పనులు జరిగాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.14.90 లక్షలతో కాలువల పూడికతీత, మరమ్మతులు, పంచాయతీరాజ్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో ఐదు సీసీ రోడ్లు మంజూరయ్యాయని చెప్పారు. విద్యుత్ శాఖలో టీ అండ్ డీ గ్రాంట్ ద్వారా రూ.2.02 లక్షలతో వివిధ పనులు చేపట్టామని, ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.62.50 లక్షలతో 18 సీసీ డ్రెయిన్లు, పంపుసెట్లు, రూ.13.50 లక్షలతో తాగునీటి సదుపాయం కల్పించామని పేర్కొన్నారు.

వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ కింద రూ.15 లక్షలతో సీసీ డ్రెయిన్లు, ఇంకుడు గుంతలు నిర్మించామని, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 10 మందికి రూ.12.10 లక్షలు అందించామని వివరించారు. ఇప్పటివరకు గడిచింది రెండున్నరేళ్లు మాత్రమేనని, ఇంకా రెండున్నరేళ్లు ఉందని, ఇళ్లు, ఇంటి పట్టాలు, రోడ్లు, డ్రెయిన్లు వంటి పనులు చేయాల్సి ఉందని చెప్పారు.

### నామినేషన్ ఉపసంహరణకు అంగీకారం

కూటమిలో స్థానం దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన తెలుగుదేశం నేత పెంచల ప్రసాద్ గారిని ఎమ్మెల్యే గారు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీ గారితో పాటు వెళ్లి కలిశారు. ఆ స్థానంలో కూటమి తరఫున నిలిచిన బీజేపీ అభ్యర్థి శ్రీ కేతన్ గారికి సహకరించాలని సూచించారు. దీంతో ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు అంగీకరించారు. ఈ నిర్ణయానికి సహకరించిన పెంచల ప్రసాద్ గారికి ఎమ్మెల్యే

## న్యాయం కోసం జీవికా ఇండస్ట్రీ ముందు రైతుల ధర్నా

### ప్రాణాలు కాపాడలంటూ ఆవేదనా వ్యక్తం చేశారు



మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని జీవిక స్టీల్ పరిశ్రమతో తీవ్ర నీటి కాలుష్యం, వాయు కాలుష్యం ఏర్పడుతోందని, వ్యవసాయ పంట పొలాల్లో దుమ్ము ధూళితో పంటలు నష్టపోతున్నాయని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రైతులు, గ్రామస్తులు, నాయకులు కలిసి కంపెనీ ముందు టెంట్ వేసి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. వెంటనే కంపెనీ అనుమతులు రద్దు చేసి జీవిక కంపెనీని తొలగించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ "జీవిక స్టీల్ పరిశ్రమ వల్ల మా బోర్లు, బావుల నీరు కలుషితమై తాగడానికి కూడా పనికిరాకుండా పోయిందని . పరిశ్రమ నుండి వచ్చే దుమ్ము, పొగతో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. పశువులకు కూడా రోగాలు వస్తున్నాయి.రైతులు అన్నారు గతంలో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పీసీబీ అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే కంపెనీని మూసివేయకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తాం. మా భూములు, మా ప్రాణాలు కాపాడండి" అని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో చేగుంట, అనంతసాగర్ చిన్న శివునూర్ చేగుంట, ఉల్లి తిమ్మాయి పల్లి రైతులు, గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా చూస్తున్నారు.

## చేగుంటలో 20 ఏళ్ల నిరీక్షణకు తెర.. సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్



మెదక్ జిల్లా, చేగుంట పట్టణ కేంద్రంలోని గ్రామ పంచాయతీకి ఎదురుగా 7వ వార్డు పరిధి శ్రీనివాస్ నగర్ కాలనీ లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది; ఆదివారం స్థానిక సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ ముఖ్య అతిథిగా హాజరై, కొబ్బరికాయ కొట్టి పనులను శాస్త్రోక్తంగా ప్రారంభించారు; ఈ సందర్భంగా 7వ వార్డు సభ్యుడు ఆరిఫ్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, గ్రామ పంచాయతీ పాలకవర్గం, సర్పంచ్ ప్రత్యేక చొరవతో నేడు పనులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు; వార్డులోని మరో రెండు గల్లీలలో కూడా తదుపరి బడ్జెట్‌లో నిధులు కేటాయించి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు; అనంతరం ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ మంజీరా పాఠశాల ఉండేదని, నిత్యం వెయ్యి మంది విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గమైనప్పటికీ ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణం నోచుకోలేదని గుర్తుచేశారు; అత్యవసర ప్రాధాన్యత ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ గ్రామమంతటా క్రమపద్ధతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చేగుంట మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ సంద్రుగు సతీష్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## విధులు నిర్వహిస్తున్న ప్రవళికపై దాడి చేసిన వారిని శిక్షించాలి

### టీ.జే.ఎం.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో విధులు నిర్వహిస్తున్న మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళ్లికపై జరిగిన దాడి ఘటనను తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా ఖండించింది.ఆధార్ కార్డు లేకపోవడంతో టికెట్ తీసుకోవాలని సూచించిన కండక్టర్ ప్రవళ్లికను ప్రయాణికురాలు తోసివేయడంతో ఆమె కిందపడి ప్రమాదానికి గురైన ఘటన అత్యంత బాధాకరమని యూనియన్ నాయకత్వం పేర్కొంది. ప్రయాణికులకు నిరంతరం సేవలందిస్తూ,వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులపై దాడులకు పాల్పడటం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేసింది.రాత్రనకా, పగలనక ,పండుగలనక నిరంతరం ప్రజలకు సేవలందించే కార్మికులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై దాడులను ఏమాత్రం సహించబోమని అన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిపై హత్య నేరం క్రింద కేసు బుక్ చేసి నాన్ బెలబుల్ క్రింద అరెస్ట్ చేసి రిమాండుకు పంపి కఠిన చర్య తీసుకోవాలని టీజేఎంయు డిమాండ్ చేసింది.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే పటిష్టమైన చర్యలు చేపట్టాలని,విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేసింది.ఈ సమస్యపై త్వరలో ఆర్టీసీ వీసీ,ఎండీ ని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది. ఆర్టీసీ కార్మికులపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు.అలాగే భవిష్యత్తులో కార్మికులపై ఇలాంటి దాడులు పునరావృతమైతే తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ అన్ని కార్మిక

## పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ఫారం-18 పంపిణీ



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటరు జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభమైనందున, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-18 పంపిణీ కార్యక్రమాన్ని సికింద్రాబాద్‌లో నిర్వహించారు.

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆడం సంతోష్ కుమార్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ఫారం-18లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, గుంటి కృష్ణ, నాయకురాళ్లు రూత్ క్లారి, కస్తూరి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అర్హతలు:
01-11-2026 నాటికి డిగ్రీ పొంది మూడేళ్లు పూర్తయి ఉండాలి.
సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసి అయి ఉండాలి.గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి.

కావాల్సిన పత్రాలు
డిగ్రీ లేదా ప్రొవిజినల్ సర్టిఫికెట్ జిరాక్స్
ఆధార్ కార్డు జిరాక్స్
ఓటర్ ఐడీ జిరాక్స్
పాస్‌పోర్ట్ సైజు ఫొటో
దరఖాస్తుకు చివరి తేదీ: 06-11-2026

అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఖవశేవశ్రీఖఅస్త్రుఖు.అఖఎ.అఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత ఈఆర్‌ఓ/ఏఈఆర్‌ఓ కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఫారం-18 కావాల్సిన వారు నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా కాసాల గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ దుర్గా మాత రెండవ వార్షికోత్సవం

### వేద పండితులు హరి ప్రసాద్



హత్నూర మండలం కాసాల గ్రామంలో ఆదివారం శ్రీ దుర్గా భవాని మాత రెండవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.వేద మంత్రోచ్చరణల మధ్య హోమం,కుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవం ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేకంగా అలంకరించి పూజల నిర్వహించడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ ఉత్సవాలలో మహిళలు,గ్రామపెద్దలు అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు హరి ప్రసాద్ మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ళు సల్లంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు ప్రజలు,భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దుర్గమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు

# బంగాళాఖాతంలో బలపడుతున్న తుఫాను..

# తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలుల

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,** అక్టోబర్ 25: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతూ తుఫానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తీవ్ర తుఫాను రూపంలో దాటే అవకాశముందని అంచనా వేసింది. మరోవైపు, తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం**

తూర్పు-మధ్య, దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం ఉదయం 8.30 గంటలకు 15.3 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 91.2 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది. ఇది విజయపురానికి ఉత్తర-వాయవ్యంగా 440 కిలోమీటర్లు, విశాఖపట్నానికి తూర్పు-ఆగ్నేయంగా 880 కిలోమీటర్లు, కాకినాడకు 980 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 1,080 కిలోమీటర్లు, బాపట్లకు 1,150 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. అనంతరం దిశ మార్చుకుని పశ్చిమ-వాయవ్య దిశగా ప్రయాణించే అవకాశం ఉంది. ఈ క్రమంలో సోమవారం ఉదయానికి తుఫానుగా, మంగళవారం ఉదయానికి తీవ్ర తుఫానుగా బలపడవచ్చని అంచనా వేస్తున్నారు.

**28న ఏపీ తీరాన్ని దాటే అవకాశం**

ఈ తుఫాను మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారి, ఈ నెల 28వ తేదీ ఉదయానికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోని పశ్చిమ-మధ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉంది. అదే రోజు బాపట్ల, విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచవచ్చని హెచ్చరించింది. తుఫాను కదలికలు, తీవ్రతను వాతావరణ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది.

**తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలు**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ ప్రభావంతో తెలంగాణలోనూ వర్షాలు కురిసే అవకాశముంది. ఆదివారం, సోమవారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొంది.

# ధర్మపురి బస్ స్టేషన్ ఆధునీకరణకు రూ.2.57 కోట్లతో శంకుస్థాపన

**2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో పుణ్యక్షేత్రాల బస్ స్టేషన్ల అభివృద్ధి -- ధర్మపురికి బస్ డిపో ఏర్పాటు, ముంబైకి బస్సు సర్వీసు ప్రారంభించేలా చర్యలు : మంత్రి పొన్నం ప్రభాకర్**



**ధర్మపురి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:** జగిత్యాల జిల్లా ధర్మపురి బస్ స్టేషన్‌ను రూ.2.57 కోట్ల వ్యయంతో ఆధునీకరించే పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 1993లో ప్రారంభమైన ధర్మపురి బస్ స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. బస్ స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాల విస్తరణ, గ్రానైట్ ఫ్లోరింగ్, కొత్త టాయిలెట్ బ్లాక్ నిర్మాణం, సీసీ పేవ్‌మెంట్‌తో పాటు ప్రయాణికులకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు వివరించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**గోదావరి పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు**

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని ప్రధాన పుణ్యక్షేత్రాలకు అనుసంధానంగా ఉన్న బస్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పుష్కరాల సమయంలో భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులను సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.

**ధర్మపురికి బస్ డిపో, ముంబైకి బస్సు సర్వీసు**

ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని సేకరించి, అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను కోరినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ధర్మపురి నుంచి ముంబైకి బస్సు సర్వీసు ప్రారంభించడంతో పాటు కరీంనగర్--జగిత్యాల--ధర్మపురి మధ్య రాత్రి వేళల్లో బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సౌకర్యాలు అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు, ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

**మహాలక్ష్మి పథకంతో మహిళలకు భారీగా ఆదా**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు 367 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు దాదాపు రూ.13 వేల కోట్లు ఆదా చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు చేరేలా, ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సేవలను విస్తరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వివరించారు. ధర్మపురి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రాష్ట్ర రాజధానుల నుంచి నగరాలను పాలించలేం పట్టణ ప్రభుత్వాలకు అధికారాల బదలాయింపు అవసరం నీతి ఆయోగ్ సభ్యుడు రాజీవ్ గౌబా




**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:** దేశ ఆర్థిక వృద్ధికి కేంద్రాలుగా నగరాలు ఎదగాలంటే పట్టణ ప్రభుత్వాలకు పూర్తిస్థాయి అధికారాలు, ఆర్థిక వనరులు కల్పించాలని నీతి ఆయోగ్ సభ్యుడు రాజీవ్ గౌబా అన్నారు. రాష్ట్ర రాజధానుల నుంచి నగరాలను సమర్థంగా పాలించలేమని స్పష్టం చేశారు. రెండో జాతీయ పట్టణ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనకు పట్టణ పాలన, ప్రణాళిక, ఆర్థిక వ్యవస్థల్లో సమగ్ర సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు.

ప్రస్తుతం సుమారు 50 కోట్లుగా ఉన్న దేశ పట్టణ జనాభా 2050 నాటికి 85 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అప్పటికి దేశ జనాభాలో దాదాపు సగం మంది పట్టణాల్లో నివసించే అవకాశం ఉందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, గృహాలు, ప్రాథమిక సేవలు అందించేందుకు నగరాల ప్రణాళిక, పాలన, నిధుల సమీకరణ విధానాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు.

నగర మేయర్లను ప్రజలు నేరుగా ఎన్నుకునే విధానం ప్రవేశపెట్టి, ఐదేళ్ల పదవీకాలం కల్పించాలని గౌబా ప్రతిపాదించారు. మేయర్ ఆధ్వర్యంలోని మండలి విధానాన్ని అమలు చేయడంతో పాటు మున్సిపల్ ఎన్నికలు సకాలంలో నిర్వహించాలన్నారు. రాజ్యాంగంలోని 74వ సవరణకు అనుగుణంగా మాస్టర్ ప్లానింగ్, నీటి సరఫరా, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ తదితర 18 విధులను పట్టణ స్థానిక సంస్థలకు రాష్ట్రాలు బదలాయించాలని కోరారు. స్థానిక అవసరాలకు స్పందించే అధికారాలు, సంస్థాగత సామర్థ్యం ఉన్నప్పుడే ప్రజల భాగస్వామ్యం అర్థవంతంగా ఉంటుందని చెప్పారు.

మున్సిపాలిటీల ఆదాయం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఆస్తిపన్ను, సేవా రుసుముల వసూళ్లను మెరుగుపరచాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక సంఘాలను క్రమం తప్పకుండా ఏర్పాటు చేసి, పట్టణ స్థానిక సంస్థలకు తగిన నిధుల బదలాయింపు జరిగేలా చూడాలన్నారు.

పట్టణ ప్రణాళికల్లోనూ సంస్కరణలు అవసరమని గౌబా పేర్కొన్నారు. భవన నిర్మాణ విస్తీర్ణ నిష్పత్తి పరిమితులు, నిర్మాణ నిబంధనలను సంస్కరించి భూమి లభ్యతను పెంచాలని సూచించారు. నివాస, వాణిజ్య అవసరాలకు అనువైన మిశ్రమ భూ వినియోగం, ప్రజా రవాణా కేంద్రాల చుట్టూ అభివృద్ధి, భూ సమీకరణ విధానాలను ప్రోత్సహించాలన్నారు. వలస కార్మికులు, పారిశ్రామిక శ్రామికులు, విద్యార్థులు, యువ ఉద్యోగులకు అందుబాటు ధరల్లో అద్దె గృహాలు కల్పించేందుకు రాష్ట్రాలు ఆదర్శ అద్దె చట్టాన్ని స్వీకరించాలని కోరారు.

పట్టణ రంగానికి బడ్జెట్ కేటాయింపులు పదిరెట్లు పెరిగాయని, మెట్రో రైలు--బస్సు వ్యవస్థలపై సుమారు రూ.3.7 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. నగరాలను వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు 2025--26 బడ్జెట్‌లో ప్రకటించిన రూ.లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ను ప్రస్తావించారు.

రాష్ట్రాలు కొత్త మున్సిపల్ చట్టాల ద్వారా ఈ సంస్కరణలను అమలు చేయవచ్చని గౌబా అన్నారు. పట్టణ పథకాల కింద అందించే సహాయాన్ని సంస్కరణల అమలుతో అనుసంధానించాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సూచించారు. అధికారాలు కలిగిన పట్టణ ప్రభుత్వాలతోనే వికసిత రాష్ట్రాలు, వికసిత భారత్ లక్ష్యాలను చేరుకోగలమని స్పష్టం చేశారు.

# తెలంగాణలో స్వీట్ షాపులపై టీజీ సేఫ్ ప్రత్యేక తనిఖీలు

**53 స్వీట్ తయారీ కేంద్రాలు, విక్రయ దుకాణాల్లో తనిఖీలు.. 38 నమూనాల సేకరణ, 20 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు**






**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్వీట్ తయారీ కేంద్రాలు, విక్రయ దుకాణాలపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అక్టోబర్ 23న అన్ని జిల్లాల్లో చేపట్టిన ఈ తనిఖీల్లో పలు దుకాణాల్లో అపరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. అనుమానాస్పదంగా ఉన్న స్వీట్ల నాణ్యతను పరిశీలించేందుకు 38 నమూనాలను సేకరించగా, 20 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయనున్నారు. మరో సంస్థకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

**అపరిశుభ్రత.. నిబంధనల ఉల్లంఘనలు**

తనిఖీల సందర్భంగా కొన్ని స్వీట్ తయారీ కేంద్రాలు, దుకాణాల్లో నేల దెబ్బతినడం, ఆహార వ్యర్థాలు చెల్లాచెదురుగా పడి ఉండటం, వాషింగ్ ఏరియాలు అపరిశుభ్రంగా ఉండటం, డ్రైనేజీలు ఆహార వ్యర్థాలతో పూడుకుపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. గోడలపై దుమ్ము, ఆహార పదార్థాల మరకలు ఉండటంతోపాటు ఎగ్జాస్ట్‌లు, చిమ్నీలపై జిడ్డు పేరుకుపోయినట్లు గుర్తించారు. ఆహార పదార్థాలను నేలపై నిల్వ చేయడం, ఆహార వస్తువులతో పాటు ఆహారేతర వస్తువులను కలిపి ఉంచడం వంటి సరికాని నిల్వ పద్ధతులు కూడా కొన్ని చోట్ల కనిపించాయి. ఆహారాన్ని తయారు చేసే సిబ్బంది హెయిర్‌నెట్స్, గ్లౌజులు ధరించకపోవడం, పెస్ట్ కంట్రోల్ రికార్డులు, సిబ్బంది ఆరోగ్య వివరాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేకపోవడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు.

**నిబంధనలు పాటించకపోతే చర్యలు**

గుర్తించిన లోపాలను సరిదిద్దుకునేందుకు 20 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయనున్నారు. ఆయా సంస్థలను తిరిగి తనిఖీ చేసి, ఆహార భద్రతా నిబంధనల అమలును పరిశీలించనున్నారు. తనిఖీల్లో నమోదైన ఉల్లంఘనలకు సంబంధించి ఒక సంస్థకు షోకాజ్ నోటీసు జారీ చేసి, జరిమానాలు విధించే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు టీజీ సేఫ్ కమిషనర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో మంచిర్యాల, జనగామ, సిద్ధిపేట, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట, పెద్దపల్లి, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, నిర్మల్, హైదరాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లి, హుజూరాబాద్, జమ్మికుంట, నిజామాబాద్, హనుమకొండ, మెదక్, ములుగు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వరంగల్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం తదితర ప్రాంతాల్లోని స్వీట్ దుకాణాలు, బేకరీలు, తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు.

పండుగలు, ఇతర సందర్భాల్లో ప్రజలు కొనుగోలు చేసే స్వీట్ల నాణ్యత, తయారీ కేంద్రాల్లో పరిశుభ్రతపై అధికారులు దృష్టి సారించారు. ఆహార భద్రతా ప్రమాణాలను పాటించని సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# రెండో పంట వేయొద్దు

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:** రాష్ట్రంలో కరవు పరిస్థితులను గుర్తించి.. రెండో పంట సాగు చేయొద్దని రైతులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఎల్‌నినో కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ కొనడానికి కూడా దొరకడం లేదని అన్నారు. రాష్ట్రంలో నెలకున్న కరవు పరిస్థితులపై సమావేశం ఏర్పాటు చేసి ప్రతిపక్ష పార్టీల నుంచి సూచనలు తీసుకుంటామని చెప్పారు. పేదలకు మంచి చేసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గదని పేర్కొన్నారు.

ఆదివారం ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ.38 కోట్లతో చేపట్టిన రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేయని కార్యక్రమాలు ఇందిరమ్మ ప్రభుత్వం చేస్తుంటే తమపై విషం కక్కుతున్నారంటూ ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి కుంటు పడనీయలేదని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

బాగాలేకున్నా.. పేదలకు అన్ని కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మొదటి పంట సాగు చేసిన రైతులకు అన్ని రకాలుగా సహకరించామని గుర్తు చేశారు. తెలంగాణలో కేంద్రంలో అధికారంలో ఉన్న వారి పార్టీ లేదని చిన్న చూపు చూడొద్దని రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలకు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తెలంగాణా రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే తీసుకురావాలని వారికి సూచించారు. ప్రభుత్వానికి సూచనలు చేయాలని రైతులను ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# హైదరాబాద్‌లో ఏసీబీ మెరుపు దాడి.. వాటర్ బోర్డు జాయింట్ డైరెక్టర్ వద్ద రూ.2.40 లక్షల నగదు స్వాధీనం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:** అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు హైదరాబాద్‌లో మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (నవీబొడాదీ) జాయింట్ డైరెక్టర్ ఎ. శ్రీనివాస్ వద్ద లెక్కల్లో చూపని రూ.2.40 లక్షల నగదు పట్టుబడింది. నగదుకు సంబంధించి ఆయన సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోవడంతో అధికారులు ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారిక ప్రకటన ప్రకారం.. అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం ఏసీబీ సిటీ రేంజ్-బృందం రాజ్‌భవన్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఎ. శ్రీనివాస్ ప్రయాణిస్తున్న మారుతి స్విఫ్ట్ కారును (నంబర్: ఖా08 ఈు 3699) అడ్డుకుని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కారులో రూ.2,40,000 నగదు గుర్తించారు. కారులో లభించిన నగదుకు సంబంధించి అధికారులు ప్రశ్నించగా, ఆ మొత్తానికి సరైన లెక్కలు లేదా సంతృప్తికరమైన వివరణ సమర్పించలేకపోయినట్లు ఏసీబీ వెల్లడించింది. దీంతో నిబంధనల ప్రకారం నగదును స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు.

స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన వివరాలను ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులకు ఏసీబీ తెలియజేసింది. ఈ ఘటనపై అవినీతి నిరోధక చట్టం కింద తదుపరి దర్యాప్తు చేపట్టనున్నట్లు అధికారిక ప్రకటనలో పేర్కొంది.

# తెలంగాణ సంస్కృతికి ప్రవాసులే రాయబారులు స్విట్జర్లాండ్‌లో బతుకమ్మ--దసరా వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు






**బెర్న్, ట్రైనెట్ న్యూస్:** మాతృభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా తెలంగాణ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్న ప్రవాసులే నిజమైన సాంస్కృతిక రాయబారులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన బతుకమ్మ--దసరా వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, పర్యాటక--సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించిన ఈ వేడుకల్లో తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మలతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. విదేశాల్లోనూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్న ప్రవాసులను అభినందించారు. భారత్--స్విట్జర్లాండ్ దేశాల మధ్య సాంస్కృతిక, పర్యాటక సంబంధాలు మరింత బలోపేతమయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు వేదాంతం కిరణ్, కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి బావిగడ్డ బ్రహ్మానందరెడ్డితో పాటు గురుదయాళ్, అభినాష్, నగేష్, రాజు, మురళి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబర్ 26, 2026
www.trinetnews.com

# జడ్పిటిసి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి,,

**-- బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌లో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారి ఇంటింటి ప్రచారం**
**-- సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం**
**-- మిగిలిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ**
**-- జడ్పీటీసీ, ఎంపీటీసీ కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై గెలిపించాలని పిలుపు**

కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు ఆదివారం సాయంత్రం బుచ్చిరెడ్డిపాళెం రూరల్ పరిధిలోని చెల్లాయపాళెం, రేబాల--1, పంచేడు, మినగళు పంచాయతీల్లో 'చెప్పాం.. చేస్తున్నాం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రెండున్నరేళ్లలో మినగళ్లులో రూ.3.53 కోట్లు, చెల్లాయపాళెంలో రూ.2.94 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టామని వివరించారు.

## సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ముందుకు

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గారు తెలిపారు. "చేసేశామని చెప్పడం లేదు.. చేస్తున్నాం. ఇంకా చేయాల్సిన పనులు కూడా ఉన్నాయి" అని స్పష్టం చేశారు. పింఛనును రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచి, రెండున్నరేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీనే అందిస్తున్నామని, ఒకటో తేదీ ఆదివారమైతే ముందు రోజే ఇస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల పింఛనును రూ.3,000 నుంచి రూ.6,000కు, అన్నదాత సుఖీభవ సాయాన్ని రూ.10,000 నుంచి రూ.20,000కు పెంచామన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మత్స్యకార సేవ, చేనేత సేవ, ఆటో సేవ వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు. రాజముద్రతో



పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ దశలవారీగా సాగుతోందని, ఇంకా అందని వారి విషయమై తహసీల్దార్‌తో మాట్లాడతానని తెలిపారు.గత ఐదేళ్లలో రోడ్లు, గుంతలను పట్టించుకోలేదని, ఇప్పుడు కోవూరు నియోజకవర్గంలోని 82 పంచాయతీల్లో ప్రతి చోటా ఎంతో కొంత పని జరిగిందని, చేయాల్సినవి ఇంకా ఉన్నాయని ఎమ్మెల్యే గారు అన్నారు. పల్లె పండుగ 3.0 కింద రాష్ట్రానికి రూ.11,000 కోట్లు రాగా, కోవూరుకు రూ.11 కోట్లు కేటాయించారని, ఆ నిధులతో రోడ్లు, డ్రెయిన్లు మంజూరై, కొన్నిచోట్ల శంకుస్థాపనలు కూడా జరిగాయని తెలిపారు. శంకుస్థాపన చేసి వదిలేయకుండా పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవాలు కూడా తామే చేస్తామని స్పష్టం చేశారు. "జరిగింది రెండున్నరేళ్లే.. ఇంకా రెండున్నరేళ్లు ఉంది. ప్రాధాన్యత క్రమంలో మిగిలిన పనులన్నీ చేస్తాం" అని హామీ ఇచ్చారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు

పంచేడు గ్రామంలో ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.24.64 లక్షలతో కాలువల పూడికతీత, గండ్ల పూడ్చివేత, కాలువల పునరుద్ధరణ పనులు జరిగాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలతో రెండు సీసీ రోడ్లు, జడ్పీ నిధులు రూ.15 లక్షలతో ఎన్ఎస్ఆర్ గిరిజన కాలనీలో మూడు సీసీ రోడ్లు నిర్మించామని, ఎన్‌హెచ్ఎం నిధులు రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. సీసీ రోడ్ల కోసం మరో రూ.30 లక్షల జడ్పీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. విద్యుత్తు శాఖ ద్వారా రూ.4 లక్షలతో రెండు 15 ఖవా సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.40 వేలతో 8 కొత్త విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. రూ.3.75 కోట్లతో నిర్మించిన పంచేడు సబ్‌స్టేషన్ పూర్తయిందని, ఈ సబ్‌స్టేషన్‌తో పాటు 11 ఖ౦, 33 ఖ౦ లైన్ల ద్వారా 24 గంటల విద్యుత్తు అందుతుందని వివరించారు.

చెల్లాయపాళెం గ్రామంలో రెండున్నరేళ్లలో రూ.2.94 కోట్ల పనులు జరిగాయని, ఇంతకుముందెన్నడూ ఇంత అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే గారు అన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.22.60 లక్షలతో నాలుగు కాలువల్లో పూడికతీత, మరమ్మతులు చేపట్టామని చెప్పారు. పంచాయతీరాజ్ నిధులతో రూ.15 లక్షలతో రెండు సీసీ రోడ్లు, రూ.28.20 లక్షలతో ఆరు సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవన నిర్మాణం మంజూరయ్యాయని వివరించారు.
మినగళ్లు గ్రామంలో రెండున్నరేళ్లలో రూ.3.53 కోట్ల విలువైన పనులు చేపట్టామని ఎమ్మెల్యే గారు తెలిపారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ

కొత్త మినగళ్లులో సాల్మన్‌పురం మార్గంలో దెబ్బతిన్న కోవూరు కాలువ బ్రిడ్జికి ఎస్టిమేషన్లు పంపామని, మంజూరు చేయించి నిర్మిస్తామని ఎమ్మెల్యే గారు చెప్పారు. పాత, కొత్త మినగళ్లుల నుంచి ఉద్యోగాల కోసం నెల్లూరుకు వెళ్లి వచ్చే సుమారు 300 మంది రాత్రివేళ ఇబ్బంది పడకుండా, రోడ్డు పూర్తయ్యాక దాతల సహకారంతో 15 సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. పాత మినగళ్లులో పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్లకు ఎస్టిమేషన్లు పంపామని, సీసీ డ్రెయిన్లు, రోడ్ల కోసం వచ్చిన వినతులన్నింటినీ ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చెల్లాయపాళెం నుంచి జొన్నవాడ, కాగులపాడు వరకు రోడ్లు వేస్తామని, పంచాయతీరాజ్‌లో ఇప్పటికే మంజూరైన రోడ్ల జాబితాను పరిశీలించి, లేనివాటిని మంజూరు చేయిస్తామని తెలిపారు. బీసీ కాలనీలో పట్టాదారు పాస్ పుస్తకాలు రాని రైతుల సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించండి

బుచ్చిరెడ్డిపాళెం జడ్పీటీసీ కూటమి అభ్యర్థి శ్రీ ఏటూరు శివరామకృష్ణారెడ్డి గారు మండలాన్ని అవినీతి రహితంగా, సుందరంగా తీర్చిదిద్దుతారన్న నమ్మకంతో ముఖ్యమంత్రి గారు ఆయనను అభ్యర్థిగా నిలిపారని ఎమ్మెల్యే గారు తెలిపారు. పంచేడు, చెల్లాయపాళెం కలిపి ఒక ఎంపీటీసీ స్థానంగా ఉన్నందున, శ్రీ పప్పు మస్తానయ్య గారి సతీమణి శ్రీమతి పప్పు సౌజన్యమ్మ గారిని, రేబాల ఎంపీటీసీ అభ్యర్థిగా శ్రీమతి అరగుంట ఉష గారిని బరిలో నిలిపామన్నారు. నీతి, నిజాయితీతో ప్రజల మధ్య ఉండి సేవ చేసే అభ్యర్థులనే ఎంపిక చేశామని, జడ్పీటీసీ, ఎంపీటీసీ కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు

# నెల్లూరు మేయర్ అభ్యర్థిని గెలిపించండి,,

**కూటమి ప్రభుత్వ హయాంలో నెల్లూరులో అభివృద్ధి పరుగులు: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు**
**- రోడ్లు, పార్కులు, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు కోట్లాది రూపాయల నిధులు**
**- పేద విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా మంత్రి నారాయణ గారు అడుగులు**
**-- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు**
**- నెల్లూరులో 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు**
**- రూప్ కుమార్ యాదవ్‌ను మేయర్‌గా ఎన్నుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి**
**- 19వ డివిజన్‌లో టీడీపీలో చేరిన సీవీ అసోసియేట్స్ ప్రతినిధులు**



నెల్లూరు నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నెల్లూరులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు.
నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం ఎంపీ గారు 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నగర అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మేయర్ అభ్యర్థి శ్రీ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ గారితో పాటు 56, 61, 62, 63, 64, 65 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు శ్రీమతి నందిమండలం వెంకట శ్రీదివ్య గారు, శ్రీ ఆనం రంగమయూర్ రెడ్డి గారు, శ్రీ పోట్లూరు రామకృష్ణ గారు, శ్రీ మొహమ్మద్ జుబేరుద్దీన్ గారు, శ్రీ షేక్ నజీమా గారు, శ్రీ ధర్మవరపు గణేశ్ కుమార్‌లను ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరాభివృద్ధికి పెద్దపీట

కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మున్సిపల్ శాఖ మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారు నెల్లూరు నగర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని ఎంపీ ప్రభాకర్ రెడ్డి గారు ప్రశంసించారు. నగర రూపురేఖలను మార్చేలా రోడ్లు, పార్కులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కోట్లాది రూపాయల నిధులను తీసుకొచ్చి పనులు చేపడుతున్నారని వివరించారు. నగర ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అభివృద్ధి అనేది కేవలం హామీలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చేలా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

విద్య ప్రతి ఒక్కరి జీవితంలో కీలకమని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు పేర్కొన్నారు. నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థి దశ నుంచి రాజకీయ నాయకుడిగా ఎదిగిన మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందితేనే వారి భవిష్యత్తు బలపడుతుందని, విద్యారంగంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాబోయే తరాలకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి అభ్యర్థుల ధ్యేయం

తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు ఉన్నారని ఎంపీ ప్రభాకర్ రెడ్డి గారు అన్నారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి, పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకులను కూటమి తరఫున కార్పొరేటర్ అభ్యర్థులుగా బరిలో నిలిపామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఎదురైనా స్పందిస్తూ, వారికి అందుబాటులో ఉంటూ సేవలందించగల నాయకత్వం నగరానికి అవసరమని పేర్కొన్నారు. అనుభవజ్ఞుడైన శ్రీ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌ను మేయర్‌గా గెలిపించడంతో పాటు, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీ గారు

చెంగయ్య ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నెల్లూరును మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనకు మద్దతుగా నిలవాలని కోరారు.

## టీడీపీలో చేరిన సీవీ అసోసియేట్స్ ప్రతినిధులు

నెల్లూరు నగరంలోని 19వ డివిజన్‌లో కర్తం ప్రతాప్ రెడ్డి గారి నివాసంలో మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారు, నెల్లూరు ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి సమక్షంలో సీవీ అసోసియేట్స్‌కు చెందిన శ్రీ చిట్లూరి వెంకటేశ్వర్లు, శ్రీ దుగ్గా శివప్రసాద్ రెడ్డి గారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ గారు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి, వారి విజయానికి సహకరించాలని కోరారు.

# స్వచ్ఛత ప్రత్యేక ప్రచారంలో ఎంఎన్ఆర్ఈ పురోగతి నిర్దేశిత లక్ష్యాల్లో 60--70 శాతం పూర్తి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
స్వచ్ఛత, రికార్డుల సమర్థ నిర్వహణ, పెండింగ్ అంశాల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమం--6ను కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) చురుగ్గా అమలు చేస్తోంది. మంత్రిత్వ శాఖతో పాటు అనుబంధ సంస్థలు నిర్దేశించుకున్న లక్ష్యాల్లో సుమారు 60--70 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించింది.
కార్యాలయాలు, కారిడార్లు, క్యాంటీన్లలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు భౌతిక రికార్డులను సమీక్షించి, నిబంధనల ప్రకారం అవసరం లేని పాత రికార్డులను తొలగిస్తున్నారు. నిరుపయోగ వస్తువులను తొలగించడం, కార్యాలయ స్థలాన్ని సమర్థంగా వినియోగించడం, మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ--వ్యర్థాలను గుర్తించి తొలగించడం వంటి చర్యలు చేపడుతున్నారు.
ఈ కార్యక్రమంలో మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు భారత పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (ఇరెడా), సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) పాల్గొంటున్నాయి. జాతీయ సౌరశక్తి సంస్థ, జాతీయ పవనశక్తి సంస్థ, సర్దార్ స్వరణ్ సింగ్ జాతీయ బయోఎనర్జీ సంస్థ కూడా భాగస్వాములయ్యాయి.
ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతను నిరంతర ప్రక్రియగా కొనసాగించడం, పెండింగ్ అంశాలను తగ్గించడం లక్ష్యంగా పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఈ ప్రచారాన్ని చేపట్టింది. అక్టోబర్ 2న ప్రారంభమైన అమలు దశ ఈ నెల 31 వరకు కొనసాగనుంది. గడువులోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు ప్రచారం అనంతరం కూడా పరిశుభ్రత, జవాబుదారీతనం, సమర్థ కార్యాలయ నిర్వహణను కొనసాగిస్తామని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# స్క్రాప్ విక్రయంతో ఎన్ఎల్‌సీకి రూ.3.12 కోట్ల ఆదాయం ప్రత్యేక ప్రచారం--6లో కీలక లక్ష్యాలను అధిగమించిన సంస్థ

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
స్వచ్ఛత, నిరుపయోగ సామగ్రి తొలగింపు లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక ప్రచారం--6లో ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ కీలక లక్ష్యాలను అధిగమించింది. అక్టోబర్ 23 నాటికి 1,272 మెట్రిక్ టన్నుల స్క్రాప్‌ను విక్రయించి రూ.3,11,89,078 ఆదాయం సమకూర్చుకున్నట్లు సంస్థ వెల్లడించింది.దేశవ్యాప్తంగా కేంద్ర మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఎన్ఎల్‌సీ తన యూనిట్లు, ప్రాంతీయ కార్యాలయాలు, సంయుక్త సంస్థల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతోంది.తొలుత 145 ప్రదేశాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 180 ప్రదేశాల్లో నిర్వహించినట్లు సంస్థ తెలిపింది. నిరుపయోగ సామగ్రిని తొలగించడం ద్వారా 24,15,786 చదరపు అడుగుల స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యాన్ని అధిగమించి, 24,96,193 చదరపు అడుగుల స్థలాన్ని వినియోగానికి సిద్ధం చేసింది. అలాగే 1,266.22 మెట్రిక్ టన్నుల స్క్రాప్ తొలగింపు లక్ష్యానికి మించి 1,272 మెట్రిక్ టన్నులను తొలగించింది.ఈ--వ్యర్థాల నిర్వహణ నిబంధనలు--2022కు అనుగుణంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, పర్యావరణహిత తొలగింపునకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు సన్నాహక దశలో లక్ష్యాలను నిర్దేశించగా, అక్టోబర్ 2న ప్రారంభమైన అమలు దశ ఈ నెల 31 వరకు కొనసాగనుంది.

# తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కీలక భేటీ.. ముంబైకి సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**



తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై చర్చించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర పర్యటనకు బయలుదేరనున్నారు. ఆదివారం రాత్రి 7 గంటలకు హైదరాబాద్ నుంచి ముంబైకి వెళ్లనున్న సీఎం.. అక్కడే రాత్రి బస చేయనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశం కానుంది. ఈ భేటీలో ప్రధానంగా తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించనున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

# ఓటు హక్కు పరిరక్షణకు చలో ఢిల్లీ: మంత్రి పొంగులేటి పిలుపు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబర్ 25: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహార్యాలీలో తెలంగాణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి తెలంగాణ యువత, మహిళలు,



రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. బీజేపీ సాగిస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తున్న 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా, ఓటు హక్కు పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని అన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో ప్రజలతో కలిసి పాల్గొనేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబర్ 26, 2026
www.trinetnews.com

# జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

**ఒక్క కిలో చెత్త కూడా అక్కడికి రానివ్వొద్దు.. ఉన్న చెత్తను రీసైకిల్ చేయాలి: ఎంపీ ఈటల రాజేందర్**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,** అక్టోబర్ 25: జవహర్ నగర్ డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకులకు వ్యక్తిగత కక్షలు ఉండకూడదని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలోనే పదవులకు సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు కాలుష్య నియంత్రణ, బాధిత ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షత వహించగా, మేధావులు, పర్యావరణవేత్తలు, డంపింగ్ యార్డు బాధితులు పాల్గొన్నారు.



### ప్రజలు నరకం అనుభవిస్తున్నారు

జవహర్ నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు ప్రాణాలు పోయినా పర్వాలేదన్నట్లుగా జీవిస్తున్నారని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు కారణంగా సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో కాలుష్య సమస్యలు ఉన్నాయని, మహిళలు గర్భస్రావాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, పిల్లలకు చర్మ సంబంధిత ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని పిల్లలకు చర్మ ఇన్ఫెక్షన్లు ఉన్నాయనే కారణంతో పాఠశాలల్లో చేర్చుకోవడం లేదని బాధితులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు.
జవహర్ నగర్‌లో ఒక బాలుడిని కుక్కలు పీక్కుతిన్న ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదని, కాలుష్యం నుంచి ప్రజలకు విముక్తి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

### రాంకీ సంస్థపై విమర్శలు

రాంకీ సంస్థ తన ఆర్థిక బలం, పలుకుబడితో కోర్టులు ఇచ్చిన తీర్పులను సైతం అమలు చేయకుండా వ్యవహరిస్తోందని ఈటల రాజేందర్ ఆరోపించారు. ప్రజల కోసం ఖర్చు చేయాల్సిన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను జవహర్ నగర్ ప్రాంతంలో తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించకుండా ఇతర రాష్ట్రాల్లో ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. చెత్తను ఏరుకుని జీవించే వారి ఉపాధిని కూడా రాంకీ సంస్థ దెబ్బతీస్తోందని ఆరోపించారు. సంస్థ లాభాలు సంపాదించడాన్ని తాను తప్పుపట్టడం లేదని, అయితే ప్రజలకు నష్టం కలిగిస్తూ లాభాలు ఆర్జించడం సరికాదని హితవు పలికారు. పాలకులే ప్రజలకు రక్షణగా ఉండాల్సింది పోయి, కంచె చేను మేసినట్లు వ్యవహరిస్తే ప్రజలకు చట్టాలపై నమ్మకం ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

### జీరో పొల్యూషన్ టెక్నాలజీతో పరిష్కారం

చెత్త నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఎంపీ సూచించారు. మరో ప్రాంతంలో చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నా ప్రజలు అంగీకరించే పరిస్థితి లేదని, అందువల్ల జీరో పొల్యూషన్ టెక్నాలజీతో చెత్త నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. చెత్తను విద్యుత్ ఉత్పత్తి, బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించే ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఢిల్లీలో కోట్ల టన్నుల చెత్తను రీసైకిల్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి ఆధునిక విధానాలను ఇక్కడ కూడా అమలు చేయవచ్చన్నారు. డంపింగ్ యార్డు సమస్యపై ఇప్పటికే పార్లమెంట్‌లో మాట్లాడానని, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కూడా కలిసి సమస్యను వివరించామని తెలిపారు.

### నాలుగు నెలలైనా ముందుకు కదలని సమస్య

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తొలిసారి కలిసింది జవహర్ నగర్ ప్రజల సమస్య పరిష్కారం కోసమేనని ఈటల రాజేందర్ వెల్లడించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరిస్తుందని ఆశించామని, అయితే సమావేశాలు నిర్వహించినప్పటికీ ఆచరణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. సమస్య పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని, నాలుగు నెలలు గడిచినా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని అన్నారు. రాజ్యాంగాన్ని, న్యాయస్థానాల తీర్పులను గౌరవించకుండా వ్యవహరించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

### ఈ నెల 27 నుంచి పాదయాత్ర

జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం అక్టోబర్ 27 నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఈటల రాజేందర్ ప్రకటించారు. ప్రతి బాధిత కుటుంబం నుంచి కనీసం ఒక్కరైనా పాదయాత్రలో పాల్గొనాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్య పరిష్కారం అయ్యే వరకు తాను రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.
ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తీసుకొచ్చే బాధ్యతను కూడా తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. డంపింగ్ యార్డు కారణంగా వెలువడుతున్న కాలుష్యం 12 లక్షల కార్ల నుంచి వచ్చే కాలుష్యంతో సమానమని పేర్కొంటూ, ఈ సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు.

### రాజకీయ కక్షలకు ప్రజలను బలి చేయొద్దు

కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ, గత ప్రభుత్వ తప్పిదాలపై చర్యలు తీసుకోవాలనే పేరుతో తెలంగాణ రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని ఈటల రాజేందర్ అన్నారు. కేసీఆర్‌ను బోనులో పెట్టాలని తాను గతంలోనూ చెప్పానని, అయితే నీటిని ఎత్తిపోసి వినియోగించుకోలేకపోవడం వల్ల ప్రజలకు నష్టం జరిగిందని విమర్శించారు. 670 టీఎంసీల నీరు దిగువకు వెళ్లిపోయిందని, రాష్ట్ర అవసరాలకు 150 టీఎంసీల నీరు సరిపోయేదని పేర్కొన్నారు. జవహర్ నగర్ సమస్యను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. పాలకులకు వ్యక్తిగత కక్షలు ఉండకూడదని, గొప్ప పదవిలో ఉండటం కంటే ఆ పదవికి ఎంత న్యాయం చేస్తున్నామన్నదే ముఖ్యమని అన్నారు. రేవంత్.. కాలగర్భంలో కలిసిపోతావా
గుర్తుండిపోయేలా ఉంటావా నిర్ణయించుకో"లిలి అంటూ ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు.

### ఒక్క కిలో చెత్త కూడా రానివ్వొద్దు

జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు ఇకపై ఒక్క కిలో చెత్త కూడా రానివ్వకూడదని, ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో రీసైకిల్ చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జవహర్ నగర్ ప్రజలకు కాలుష్యం నుంచి శాశ్వత విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం వాటా కల్పించాలి: గోలి ప్రభాకర్**



**నల్గొండ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
దివ్యాంగుల హక్కుల చట్టం--2016ను పకడ్బందీగా అమలు చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల విభాగం కో కన్వీనర్ గోలి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా దివ్యాంగుల విభాగం కన్వీనర్ రాపోలు సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా గోలి ప్రభాకర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో సలహా మండలిని, జిల్లా స్థాయిలో కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడంతో దివ్యాంగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. చట్టం అమలులో నిర్లక్ష్యం తగదన్నారు.
నల్గొండ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కోటాను పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేద దివ్యాంగులను గుర్తించి ఇళ్లు కేటాయించాలని కోరారు.
రాబోయే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్గొండ జిల్లా కేంద్రంలో నిరుపేద దివ్యాంగులకు ఉచితంగా వస్త్రాలు, సహాయక పరికరాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా కో కన్వీనర్ ముంత మల్లేష్ యాదవ్, యాదగిరితో పాటు వివిధ మండలాల దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, బీజేపీ దివ్యాంగుల విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాకీటాకీల తప్పుదారి పట్టించే ప్రకటనలపై సీసీపీఏ కొరడా

**హోగర్ టెక్నాలజీస్‌కు రూ.లక్ష జరిమానా.. 12 సంస్థలపై మొత్తం రూ.58 లక్షల పెనాల్టీలు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
వాకీటాకీల విక్రయాల్లో కీలక నియంత్రణ వివరాలను వెల్లడించకుండా వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్న సంస్థలపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) చర్యలు ముమ్మరం చేసింది. ఆపరేటింగ్ ఫ్రీక్వెన్సీలు, లైసెన్సింగ్ నిబంధనలను స్పష్టంగా తెలియజేయకుండా ప్రకటనలు ఇచ్చిన హోగర్ టెక్నాలజీస్ అండ్ ఇన్నోవేషన్స్ ఎల్ఎల్‌పీపై రూ.లక్ష జరిమానా విధించింది. సీసీపీఏ చీఫ్ కమిషనర్ నిధి ఖరే, కమిషనర్ అనుపమ్ మిశ్రా నేతృత్వంలో వినియోగదారుల పరిరక్షణ చట్టం--2019 కింద ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి.
హోగర్ సంస్థ వెబ్‌సైట్‌లో ప్రదర్శించిన వివిధ వాకీటాకీ మోడళ్ల ప్రకటనలు, ఉత్పత్తుల వివరాలను పరిశీలించగా.. వాటి వినియోగానికి వర్తించే ఫ్రీక్వెన్సీలు, లైసెన్సులు, నియంత్రణ అనుమతులపై తగిన సమాచారం లేదని సీసీపీఏ గుర్తించింది. దీంతో అవసరమైన అనుమతులు లేకుండానే పరికరాలను చట్టబద్ధంగా ఉపయోగించవచ్చనే అపోహ వినియోగదారుల్లో ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.
తమ వద్ద చెల్లుబాటయ్యే డీలర్ పొసెసింగ్ లైసెన్స్, పరికరాలకు ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ ధ్రువీకరణలు ఉన్నాయని సంస్థ వాదించింది. తమ వెబ్‌సైట్ సమాచారం అందించేందుకు, వ్యాపార విచారణలు స్వీకరించేందుకు మాత్రమే ఉద్దేశించిందని, నేరుగా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించడం లేదని తెలిపింది. అయితే అనుమతులు కలిగి ఉన్నంత మాత్రాన కొనుగోలుకు ముందు వినియోగదారులకు పూర్తి సమాచారం అందించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేరని సీసీపీఏ స్పష్టం చేసింది.

### పేమెంట్ సదుపాయం లేకున్నా ప్రకటనలకు నిబంధనలు వర్తిస్తాయి

వెబ్‌సైట్‌లో పేమెంట్ గేట్‌వే లేదా షాపింగ్ కార్ట్ లేకపోయినా.. అందులోని ఉత్పత్తుల ప్రచారం వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకే వస్తుందని ప్రాధికార సంస్థ తేల్చిచెప్పింది. ఉత్పత్తిని ఏ విధానంలో విక్రయించినా, దాని చట్టబద్ధ వినియోగానికి అవసరమైన వివరాలను ప్రకటనల్లో వెల్లడించాలని సూచించింది.
2018 నాటి సంబంధిత నిబంధనల ప్రకారం 446.0--446.2 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ పరిధిలో పనిచేసే పర్సనల్ మొబైల్ రేడియోలకు నిర్దేశిత షరతులకు లోబడి లైసెన్స్ మినహాయింపు ఉంటుంది. ఆ పరిధికి వెలుపల పనిచేసే పరికరాలకు సంబంధిత నియంత్రణ నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది.

### 16,970కిపైగా నిబంధనలకు విరుద్ధమైన లిస్టింగులు గుర్తింపు

ఆన్‌లైన్ వేదికల్లో తప్పనిసరి నియంత్రణ వివరాలు లేకుండా వాకీటాకీలను విక్రయిస్తున్న వ్యవహారాన్ని సీసీపీఏ సుమోటోగా పరిశీలించింది. వివిధ ప్లాట్‌ఫామ్‌లలో 16,970కిపైగా నిబంధనలకు విరుద్ధమైన లిస్టింగులను గుర్తించి, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, మెటా, జియోమార్ట్, ఇండియామార్ట్, ట్రేడ్‌ఇండియా తదితర 13 ఈ--కామర్స్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది.
ఇప్పటివరకు 12 సంస్థలపై తుది ఉత్తర్వులు జారీ చేసి, మొత్తం రూ.58 లక్షల జరిమానాలు విధించినట్లు సీసీపీఏ వెల్లడించింది. వీటిలో కొన్ని సంస్థలు ఉత్తర్వులు, విచారణ ప్రక్రియలను న్యాయ వేదికల్లో సవాలు చేశాయని తెలిపింది.
వాకీటాకీల ప్రకటనల్లో ఆపరేటింగ్ ఫ్రీక్వెన్సీలు, వర్తించే లైసెన్సింగ్ అవసరాలు, ఇతర ముఖ్యమైన నియంత్రణ సమాచారాన్ని స్పష్టంగా పొందుపరచాలని సీసీపీఏ పునరుద్ఘాటించింది. వివరాలను దాచిపెట్టడం వల్ల వినియోగదారులు చట్టపరమైన, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, అనుచిత వ్యాపార పద్ధతుల నియంత్రణకు చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

# ముదిరాజ్ మహాసభ లో ఘనంగా దసరా సమ్మేళనం



**హైద్రాబాద్ , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్,25.అక్టోబర్ 25 :**
తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో 94వ దసరా సమ్మేళనం, ముదిరాజుల అలయ్ బలయ్, నవాడ ముత్తయ్య జయంతి వేడుకలు, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, ముదిరాజ్ యువతీ యువకుల వివాహ పరిచయ వేదిక ఘనంగా నిర్వహించారు.
ఆదివారం సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్ లో జరిగిన ఈ ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నవాడ ముత్తయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అధికారి జగన్మోహన్ గాంధీనగర్ సిఐ సురేష్ బాబు శంషాబాద్ ఎస్సై శ్రీనివాస్ నవాడ ముత్తయ్య కుటుంబ సభ్యులతో పాటు పలువురు సామాజిక సేవకులను సన్మానించారు. కాసాని సాయి రాజేంద్రప్రసాద్ మాధురి దంపతులు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.
ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు గొడుగు ఆంజనేయులు ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ దసరా సమ్మేళనంలో ముదిరాజ్ మహాసభ నాయకులు చెన్నయ్య జగదీశ్వర్, దివాకర్ ప్రకాష్, ఎం.శారద, టి.శ్రీకాంత్ తోట సురేందర్, మంద శ్రీనివాస్, వెంకటేష్, ప్రసాద్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టాం



**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఖమ్మం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25;**
తాగునీటి కష్టాలు తలెత్తకుండా తమ ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈరోజు (ఆదివారం) దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పనులను మంత్రి తుమ్మల పరిశీలించారు. కుమ్మరి గూడెం వైపు ఒడ్డు నుంచి దుమ్ముగూడెం అవతల ఒడ్డుకు బోటులో చేరుకున్నారు. ఆనకట్టపైన ఒక మీటర్ ఎత్తున ఏర్పాటు చేస్తున్న ఇసుక బస్తాల పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. సూపర్ ఎల్‌నినో ప్రపంచానికి విపత్తులా మారిందని వెల్లడించారు.
గోదావరి నీటిని నిల్వచేస్తున్నాం..
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి గండం లేకుండా గోదావరి నీటిని నిల్వచేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు. దుమ్ముగూడెం ఆనకట్టపై మీటర్ ఎత్తున నీరు నిలిచేలా ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒక టీఎంసీ నీళ్లు నిల్వ చేసేలా పనులు సాగుతున్నాయని అన్నారు. ఎగువ నుంచి వరద ఉధృతి ఉన్నా ఇసుక బస్తాలు దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వ కోసం చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపామని అన్నారు. తక్షణమే ఆయా పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు.

### ప్రజలు అసాధారణ పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలి..

ఎల్‌నినో ప్రభావంతో 0.5 డిగ్రీలు పెరిగితేనే ఎండలు భగ్గుమంటున్నాయని మంత్రి తుమ్మల చెప్పారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా వేసిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఎండలు 50 డిగ్రీలు చేరే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు అసాధారణ పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

## శ్రీ పండుగ సాయన్న జయంతి ఉత్సవాలకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపిన ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**హైద్రాబాద్ , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్,25.**
శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి ఉత్సవాలు ఈనెల 22న హైదరాబాద్లోని రవీంద్రభారతిలో జరిగాయి. ఈ కార్యక్రమానికి సహకరించిన వారిని ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అభినందించారు .అందులో భాగంగా భోయిగుడాలోని సెంట్రల్ వ్యూ అపార్ట్మెంట్లో నివాసం ఉండే బీసీ జర్నలిస్ట్ ఫోరం కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ బలరామ్ నివాసానికి వచ్చి, బలరామ్ ముదిరాజ్ తో పాటు ఆయన సోదరుడు బిజెపి నేత ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజును బొర్రా జ్ఞానేశ్వర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత బీమా లక్ష్మణ్ ముదిరాజ్, ముదిరాజ్ నేతలు రావుల రాజశేఖర్ ముదిరాజ్, కోట శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# మన రిజర్వేషన్లపై సమాలోచన" కార్యక్రమం విజయవంతం

యాదవుల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలి
యాదవ రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగుల నాగార్జున యాదవ్ పిలుపునిచ్చారు.





హుజూర్‌నగర్‌లో యాదవ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "రేపటి భవిష్యత్ తరాల కోసం… మన రిజర్వేషన్లపై -- సమాలోచన" ముఖాముఖి సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వక్తలు, సంఘం ప్రతినిధులు పాల్గొని రిజర్వేషన్ల ప్రాధాన్యత, యాదవ సామాజిక వర్గానికి సంబంధించిన హక్కులు, విద్యా--ఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రిజర్వేషన్లు కేవలం ప్రస్తుత తరానికి మాత్రమే సంబంధించిన అంశం కాదని, రాబోయే భవిష్యత్ తరాల విద్యా, ఉద్యోగ, సామాజిక అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. రిజర్వేషన్లకు సంబంధించిన చారిత్రక నేపథ్యం, ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, చట్టపరమైన అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

యాదవ సామాజిక వర్గం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని, యువతకు విద్యా అవకాశాలు పెంపొందించడంతో పాటు రాజకీయ చైతన్యం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మన హక్కుల గురించి తెలుసుకోవడం, వాటి సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశం లో హుజూర్నగర్ పట్టణ యాదవ సంఘం నాయకులు జక్కుల మల్లయ్య యాదవ్ గారు, యాదవ రాజ్యాధికార సాధన సమితి జిల్లా అధ్యక్షులు గొల్ల మల్లికార్జున్ యాదవ్ గారు, మహిళా అధ్యక్షురాలు వగ్రె కవిత యాదవ్ గారు, హుజూర్నగర్ నియోజకవర్గం యాదవ ఉద్యోగ సంఘం అధ్యక్షులు జక్కుల వెంకటేశ్వర్లు యాదవ్ గారు, మాజీ కౌన్సిలర్ జక్కుల శంబయ యాదవ్ గారు, గ్రాజూ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ గారు, ̄=ూా రాష్ట్ర కోశాధికారి గంధం లింగయ్య యాదవ్ గారు, గుడిమల్కాపురం సర్పంచ్ పుల్లేడి శ్రీనివాసరావు యాదవ్ గారు, జక్కుల శ్రీరామ్ యాదవ్ గారు టీచర్, చిర్రా శ్రీనివాస్ యాదవ్ గారు, మద్దుల నాగరాజు యాదవ్ గారు, ముక్కెర్ల మట్టయ్య యాదవ్ గారు, జక్కుల కొండలు యాదవ్ గారు, జక్కుల నాగరాజు యాదవ్ గారు, జక్కుల లక్ష్మణ్ లెక్చరర్ గారు, పండగ కొరివి వీరయ్య యాదవ్ గారు, ఆవు దొడ్డి మహేష్ యాదవ్ గారు, చెవుల లింగయ్య యాదవ్ గారు, గోల కృష్ణయ్య యాదవ్ గారు, ఎల్లావుల శివశంకర్ యాదవ్ గారు, కుంటి గొల్ల నవీన్ యాదవ్ గారు,నాయకులకు, యువతకు, కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

"మన హక్కులపై మనకు అవగాహన ఉండాలి… మన భవిష్యత్ తరాల కోసం మనమంతా ఐక్యంగా కృషి చేయాలి."

యాదవ రాజ్యాధికార సాధన సమితి

# అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దామెర వాసి గొర్రె థామస్

- అంబేద్కర్ ఆశయాల సాధనకు మరింత కృషి చేస్తా -- థామస్





తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన గొర్రె థామస్ ఎన్నికయ్యారు.ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో థామస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.గతంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గొర్రె థామస్ సంఘం అభివృద్ధికి, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల ప్రచారానికి విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది. ఈ నియామకంపై ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన అంబేద్కర్ వాదులు, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గొర్రె థామస్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్‌కు, తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలైన స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో తనకు సహకరించిన సంఘ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా అందరి సహకారంతో ఐక్యంగా ముందుకు సాగుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పారంద స్వామి, అధికార ప్రతినిధి ఇసంపెల్లి రమేష్, గౌరవ అధ్యక్షుడు జన్ను నర్సయ్య, ముఖ్య సలహాదారు ఇసంపెల్లి నీలయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వివేకానంద, జంగిలి భాస్కర్, వల్లందాస్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి మండలంలో బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యం

- మండలంలో బూత్ కమిటీల ఏర్పాటు:బీజేపీ నాయకులు





భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ, గోపాలపూర్ గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షత వహించారు.కోతులనడుమ గ్రామంలో 285, 286 బూత్‌లకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కనిపర్తి శామ్ సుందర్, ఎర్రోళ్ల అఖిల్, మాట్ల వినయ్, రావుల శ్రీధర్, మాట్ల విశాల్, రావుల శ్రీకాంత్, పల్లపు శ్రీను, గట్టు శ్రీనివాస్ బీజేపీలో చేరారు.పార్టీలో చేరిన వారికి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.గోపాలపూర్ గ్రామంలో 305వ బూత్ అధ్యక్షుడిగా కుమ్మరి సతీష్, 306వ బూత్ అధ్యక్షుడిగా చిత్రాల భాస్కర్, 307వ బూత్ అధ్యక్షుడిగా ఉప్పుల శివప్రకాష్ ఎన్నికయ్యారు.అదేవిధంగా చేరికల కమిటీ సభ్యుడిగా చిదురల వెంకటేష్‌ను నియమించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, బూత్ స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శులు అల్లి కుమార్, చిత్రాల వెంకటేష్, సీనియర్ నాయకుడు కంచర్ల శంకరయ్య, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్రోళ్ల రాజు, మడిపల్లి కొమురయ్య, మాట్ల జయేందర్, చిరంజీవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్క్రూట్నీ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో దాసిరాజు

- చెక్కుచెదరని 111 ఎంపీటీసీ నామినేషన్లు
- అధికారులను మెచ్చుకుంటున్న నామినేషన్ల నేతలు



మొగల్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు శనివారం ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్క్రూటీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ నామినేషన్ల స్క్రూట్నీ కార్యక్రమాన్ని నర్సాపురం ఆర్డీవో కే దాసిరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్తూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన నామినేషన్ల ప్రక్రియ స్క్రూట్నీ కార్యక్రమంలో ఎటువంటి లోటు పాటులు అభ్యర్థులుకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. మండలంలో 21 ఎంపీటీసీలు వారిగా అభ్యర్థులను సమావేశపు హాలు లోనికి వరుసగా పిలిచి వారి సమక్షంలో అభ్యర్థుల సమక్షంలో స్క్రూట్నీ కార్యక్రమం నిర్వహించగా మొగల్తూరు మండలంలో 21 ఎంపీటీసీల లోను మొత్తం 111 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వానిలో నూటికి నూరు శాతం నామినేషన్లు స్క్రూటీనీలో నిలబడ్డాయని మొగల్తూరు మండల ఎన్నికల అధికారి, మొగల్తూరు మండల ప్రత్యేక అధికారి జి స్వాతి అన్నారు. శనివారం సాయంత్రం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సమాచారం అందించారు. తెలుగుదేశం 25, జనసేన 34, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 45, బిజెపి 2, స్వతంత్ర అభ్యర్థులు 5 మొత్తము 111 మంది అభ్యర్థులు ఉన్నారని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అసిస్టెంట్ అధికారి సిహెచ్ త్రిశూలపాణి, అబ్దుల్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

# 19వ వార్డు లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార కార్యక్రమం



మాచర్ల పట్టణ 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బండ్ల అనురాధ బ్రహ్మయ్య, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు, మాచర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, కొమెర చందు,. బృంగా బాబూ రావు , కామినేని వీరాంజినేయులు, బొట్లగుంట ఆంజినేయులు, వీరపునేని మనోజ్ కుమార్, వెలనాటి నరసింహారావు మరియు టిడిపి మహిళా కార్యకర్తలు పాల్గొని ఛైర్మన్ అభ్యర్థి సుష్మా కేశవ రెడ్డి కి, బండ్ల అనురాధ కి తమ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుకి వేసి భారీ మెజార్టీతో గెలిపించవలసిందిగా 19వ వార్డు ప్రజల్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ ట్రైడెంట్'తో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు భారీ దెబ్బ

**38 ప్రాంతాల్లో ఏకకాల దాడులు.. 18 మంది అరెస్ట్**

**రూ.100 కోట్ల హవాలా లావాదేవీలు వెలుగులోకి.. 1,424 బ్యాంకు ఖాతాల స్తంభన**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ట్రైడెంట్'లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టురట్టయింది. అక్టోబర్ 23న అసోం, మిజోరం, మణిపూర్ రాష్ట్రాల్లోని 38 ప్రాంతాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఆయా రాష్ట్రాల పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ చర్యల్లో 18 మందిని అరెస్టు చేశారు.దర్యాప్తులో రూ.100 కోట్ల విలువైన హవాలా లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. ముఠాతో సంబంధమున్న 1,424 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతోపాటు రూ.17.82 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. దాడుల్లో 500 డిటోనేటర్లు, రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

భారత్, మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దుల మీదుగా 'డెత్ ట్రయాంగిల్ కారిడార్' ద్వారా ఈ నెట్‌వర్క్ మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. మూడు రాష్ట్రాల్లో సమన్వయంతో చేపట్టిన ఈ ఆపరేషన్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల రవాణా వ్యవస్థకు గట్టి దెబ్బగా నిలిచింది.

2029 డిసెంబర్ 31 నాటికి మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లను నిర్మూలించాలన్న లక్ష్యానికి ఈ చర్య బలాన్ని చేకూర్చిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. చివరి డ్రగ్స్ ముఠాను అంతం చేసే వరకు చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఆపరేషన్‌లో పాల్గొన్న కేంద్ర సంస్థలు, మూడు రాష్ట్రాల పోలీసులతో కూడిన మాదకద్రవ్యాల నిరోధక బృందాన్ని అభినందించింది.

# అక్టోబర్ 30న జనసేన తెలంగాణ 'అలయ్ బలయ్'

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో అక్టోబర్ 30, శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 'జనసేన తెలంగాణ అలయ్ బలయ్' ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వ స్ఫూర్తితో, తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మండల స్థాయి నాయకులు పాల్గొననున్నారు. నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు ఆత్మీయ అనుబంధం, పరస్పర విశ్వాసం, సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేయడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశం. తెలంగాణ ఆకాంక్షలు, యువత భవిష్యత్తు, విద్య, ఉపాధి, ప్రజారోగ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఉమ్మడి అవగాహన పెంపొందిస్తూ, ప్రజాసేవలో సమిష్టిగా ముందుకు సాగేందుకు ఈ కార్యక్రమం వేదిక కానుంది.

## కార్మికుల సంక్షేమమే కాకా వెంకటస్వామి లక్ష్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25;**







కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి ఒత్తిళ్లనైనా ఎదుర్కొన్న నాయకుడు కాకా వెంకటస్వామి అని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మికులకు పెన్షన్ పథకం అమలు చేస్తే పరిశ్రమలు మూతపడతాయని పారిశ్రామికవేత్తలు ఒత్తిడి తెచ్చినప్పటికీ, తన తండ్రి కార్మికుల ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని గుర్తుచేశారు. ఈ విషయాన్ని తండ్రి దృష్టికి తీసుకెళ్లినప్పుడు, కార్మికుల సంక్షేమం విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేస్తూ తనను అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పారని వివరించారు. పరిశ్రమల ఒత్తిళ్ల కంటే కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే కాకా వెంకటస్వామికి ముఖ్యమని పేర్కొన్నారు. పెద్దపల్లి లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను కూడా తండ్రి చూపిన మార్గంలోనే నడుస్తున్నానని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. కాకా వెంకటస్వామిపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల విషయంలో రాజీ పడకుండా, వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతానని స్పష్టం చేశారు.

# అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు…



అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ హెచ్చరించారు. గుడివాడలో ఐస్‌క్రీమ్ బండ్లు, గూడు ఆటోలు, గూడు లారీలు, టార్పాలిన్ కట్టిన వాహనాలతో పాల వ్యానులతో సహా అన్ని వాహనాలను ఆయన తన సిబ్బందితో తనిఖీ చేశారు. స్థానిక ఎన్నికల్లో అక్రమ మద్యం తరలించేవారు ఎంతటివారిపై అయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# లక్ష మెజారిటీ టార్గెట్-మంత్రి నారాయణ త్రిశూల వ్యూహం

- నెల్లూరు మేయర్ పీఠమే లక్ష్యంగా కూటమి దూకుడు.
- ప్రత్యర్థుల డిపాజిట్ల గల్లంతే టార్గెట్
- రూప్ కుమార్ యాదవ్ గెలుపు కోసం మంత్రి ప్రత్యేక కార్యాచరణ.
- డివిజన్ల వారీగా ప్రచారానికి పదునుపెడుతున్న నారాయణ



నెల్లూరు నగరపాలక సంస్థలో మేయర్ పీఠాన్ని భారీ మెజారిటీతో కైవసం చేసుకోవడమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ పక్కా ఎన్నికల వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. లక్షకు పైగా మెజారిటీని లక్ష్యంగా నిర్దేశించుకుని, ప్రత్యర్థి పార్టీకి గట్టి షాక్ ఇవ్వాలనే పట్టుదలతో ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రి తన సొంత ఎన్నికను తలపించే స్థాయిలో ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్నారు.
ఒకవైపు కుటుంబ సభ్యులతో రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తూనే,మరోవైపు రోజుకు సుమారు 15 డివిజన్లలో ఆత్మీయ సమావేశాలు, ముఖ్య నేతలతో భేటీలతో బిజీగా గడుపుతున్నారు. డివిజన్ల వారీగా రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలు, స్థానిక సమస్యలు, ఓటర్ల స్పందనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రచారంలో ఎక్కడా అలసత్వానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు.
ఎన్నికల ప్రచారాన్ని మూడు ప్రధాన కోణాల్లో ముందుకు తీసుకెళ్తున్నారు. మొదటిది.. కుటుంబ సభ్యులతో ప్రజల్లోకి వెళ్లి ఓటర్లను నేరుగా కలవడం. రెండోది డివిజన్ల వారీగా నేతలు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రచారాన్ని ఉధృతం చేయడం. మూడోది మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్‌తో పాటు జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి అవసరమైన రాజకీయ సమీకరణాలను బలోపేతం చేయడం. ఈ త్రిముఖ కార్యాచరణతో నగరంలో కూటమి ప్రచారానికి మరింత ఊపు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.
రూరల్ నియోజకవర్గంలోనూ కూటమి ప్రచారం వేగం పెంచుకుంది. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ఎంపీ, మేయర్ అభ్యర్థి వేర్వేరుగా ప్రచార కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళు తున్నారు. డివిజన్ల వారీగా ఓటర్లను కలుస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నగరంతో పాటు రూరల్‌లోనూ సమన్వయంతో పనిచేసేలా మంత్రి వ్యూహరచన చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
ఎన్నికల్లో కేవలం ప్రచార హడావుడే కాకుండా, ప్రతి డివిజన్‌లో సమర్థమైన క్షేత్రస్థాయి యంత్రాంగం పనిచేయాలన్నది మంత్రి లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్య నేతలతో సమీక్షలు, కార్యకర్తలతో సమావేశాలు, అభ్యర్థులతో సమన్వయం ద్వారా ప్రచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ కూటమి ఐక్యతను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నారు.
మరోవైపు, ఈ సమన్వయపూర్వక ప్రచారంతో వైఎస్‌ఆర్‌సీపీపై ఒత్తిడి పెంచాలన్నది మంత్రి వ్యూహంగా కనిపిస్తోంది. లక్ష మెజారిటీ లక్ష్యంగా మంత్రి నారాయణ వేస్తున్న అడుగులు, డివిజన్ల వారీగా సాగుతున్న ప్రచారం, మేయర్ అభ్యర్థి గెలుపుపై పెడుతున్న ప్రత్యేక దృష్టి నెల్లూరు నగర రాజకీయాల్లో ఎన్నికల వేడిని మరింత పెంచుతున్నాయి.

# మేయర్ అభ్యర్థి రూప్ ను గెలిపించండి,,,

**-- నెల్లూరు 21, 24వ డివిజన్లలో కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి ఎన్నికల ప్రచారం**
**-- మున్సిపల్ శాఖ మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారి కృషితో వేల కోట్ల నిధులతో రోడ్లు, పార్కులు, పాఠశాలల అభివృద్ధి**
**-- దోమల సమస్య పరిష్కారానికి క్లోజ్డ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి**
**-- అనుభవజ్ఞుడు, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే మేయర్ అభ్యర్థి శ్రీ రూప్ కుమార్ యాదవ్ గారిని సైకిల్ గుర్తుపై గెలిపించాలని పిలుపు**
**-- 24వ డివిజన్ టీడీపీ అభ్యర్థి శ్రీమతి ఊటుకూరు చందూప్రియ గారిని సైకిల్ గుర్తుపై, 21వ డివిజన్ జనసేన అభ్యర్థి శ్రీమతి గునుకుల విజయలక్ష్మి గారిని గ్లాస్ గుర్తుపై గెలిపించాలని విజ్ఞప్తి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి నెల్లూరు అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు 24వ డివిజన్ పరిధిలోని చిల్డ్రన్స్ పార్కులో 21వ డివిజన్ కార్పొరేటర్ కూటమి అభ్యర్థి శ్రీమతి గునుకుల విజయలక్ష్మి గారు (జనసేన), 24వ డివిజన్ కార్పొరేటర్ కూటమి అభ్యర్థి శ్రీమతి ఊటుకూరు చందూప్రియ గారి (తెలుగుదేశం) తరఫున ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు మేయర్ కూటమి అభ్యర్థి శ్రీ రూప్ కుమార్ యాదవ్ గారితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



### మంత్రి కృషితో నెల్లూరుకు కొత్త రూపు

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ, మున్సిపల్ శాఖ మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారికి నెల్లూరుపై అపారమైన అభిమానమని, అమరావతిపై ఉన్న అభిమానాన్ని మించి నెల్లూరుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. వేల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రోడ్లు, పార్కులు, పాఠశాలలు వంటి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తూ నెల్లూరు నగర రూపురేఖలను మారుస్తున్నారని, నెల్లూరు రూరల్, సిటీ ప్రాంతాల్లో ఈ మార్పు ప్రజల కళ్ల ముందే కనిపిస్తోందని చెప్పారు. దోమల సమస్య ప్రజలకు ఇబ్బందిగా మారిన నేపథ్యంలో, ఆ సమస్యను తగ్గించేందుకు క్లోజ్డ్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### పట్టుదలతో అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారు ఒక పనిని చేపడితే అది పూర్తయ్యే వరకు వదిలిపెట్టరని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ప్రశంసించారు. ఇందుకు ఉదాహరణగా నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం కలుజుపై నూతనంగా నిర్మించిన వంతెనను ప్రస్తావించారు. ఈ వంతెన నిర్మాణం కోసం ఎమ్మెల్యే గారు పట్టుదలతో కృషి చేశారని, అవసరమైన నిధులు సమకూర్చుకుని పనులు పూర్తి చేయించారని తెలిపారు. 2026 అక్టోబర్ 2న ఈ వంతెన అధికారికంగా ప్రారంభమైందని పేర్కొన్నారు. మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారి సహకారం, ఎమ్మెల్యే శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారి పట్టుదలతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే ప్రజాప్రతినిధుల లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

### అనుభవజ్ఞుడైన నాయకుడు రూప్ కుమార్ యాదవ్ గారు

నెల్లూరు మేయర్ కూటమి అభ్యర్థి శ్రీ రూప్ కుమార్ యాదవ్ గారు 2005లో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారని, కార్పొరేషన్‌లో వివిధ బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు గుర్తుచేశారు. ఇటీవల ఇన్‌చార్జి మేయర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ప్రజల్లో నుంచి, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నాయకుడిగా ప్రజల సమస్యలపై అవగాహన కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలు ఏ సమయంలో ఫోన్ చేసినా స్పందించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే శ్రీ రూప్ కుమార్ యాదవ్ గారిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి మేయర్‌గా గెలిపించాలని కోరారు. చిల్డ్రన్స్ పార్కును మరింత అభివృద్ధి చేయాలన్నా ఆయనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### కూటమి అభ్యర్థులను గెలిపించాలి

24వ డివిజన్ కూటమి అభ్యర్థి శ్రీమతి ఊటుకూరు చందూప్రియ గారిని సైకిల్ గుర్తుపై, 21వ డివిజన్ కూటమి అభ్యర్థి శ్రీమతి గునుకుల విజయలక్ష్మి గారిని జనసేన గ్లాస్ గుర్తుపై గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు అన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన అభ్యర్థులంతా సమన్వయంతో ఒక బృందంగా పనిచేస్తూ నెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు.
పార్కులో నిత్యం తిరిగే ప్రజలకు, పరిసర ప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు ఏవైనా సమస్యలు ఎదురైతే తమ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లవచ్చని, అభ్యర్థులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని పేర్కొన్నారు. నెల్లూరు నగరం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలంటే మేయర్ అభ్యర్థి శ్రీ రూప్ కుమార్ యాదవ్ గారితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులు శ్రీమతి ఊటుకూరు చందూప్రియ గారు, శ్రీమతి గునుకుల విజయలక్ష్మి గారిని గెలిపించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్

# చేగుంటలో కాలుష్యంపై ఎమ్మెల్యే సీరియస్

### ఇష్టనుసారంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు

గ్రామీణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చేగుంట మండల కేంద్రంలోని జీవిక ఇండస్ట్రీ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
గతంలో చిన్న స్థాయిలో ఉన్న జేకే ఇండస్ట్రీ ప్రస్తుతం సుమారు 10 నుంచి 15 ఎకరాల విస్తీర్ణానికి విస్తరించిందని ఎమ్మెల్యే తెలిపారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న నల్లటి పొగ, దుమ్ముతో చుట్టుపక్కల ఏడు నుంచి ఎనిమిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలువడే పొగ, దుమ్ము ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.
ప్రాణంతకంగా మారిన విశావాయువు
పరిశ్రమ కాలుష్యం కారణంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందనే భయాలు ప్రజల్లో ఉన్నాయని కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గాలి నాణ్యత దెబ్బతినడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందన్న ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయని తెలిపారు. పరిశ్రమకు భారీ వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు సైతం తలెత్తుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇలాంటి సమస్యలతో ఇబ్బందులు



పడటం ఆందోళనకరమన్నారు.

### గ్రామీణ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

చేగుంట పరిసర ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాలని, హైదరాబాద్ పరిసరాల్లోని పారిశ్రామిక ప్రాంతాల మాదిరిగా తీసి చూడకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం గ్రామాల్లో నివసించే ప్రజలు, చిన్నారులు, పాఠశాలలపై ప్రభావం చూపకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
జీవిక ఇండస్ట్రీ విస్తరణకు అవసరమైన అనుమతులు పొందిందా? కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తోందా? పర్యావరణ అనుమతులు ఉన్నాయా? ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారా? అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

### అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల శాఖ అధికారులు వెంటనే స్పందించి వీజిక ఇండస్ట్రీ



పరిసర గ్రామాల్లో పర్యటించాలని ఎమ్మెల్యే కోరారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము క్షేత్రాన్ని పరిశీలించడంతో పాటు గాలి నాణ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరిశీలనలో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

### కాలుష్యం ప్రాణంతకం కాకముందే చర్యలు తీసుకోవాలి

అక్కడి గాలి కాలుష్యం ౹ావీ2.5 70% ఉన్నట్లయితే అక్కడి ప్రజలు సురక్షితం కానీ ప్రస్తుతం అక్కడి కాలుష్యం౹ాం2.5 500 నుండి 700 వందల మధ్యలో ఉన్నందున ప్రాణంతకంగా మారకముందే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి జీవిక పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని మీాూ కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు

## ముదిరాజులను 'బీసీ-ఏ'లోకి మార్చాలి

**కావలి ప్రభు ముదిరాజ్ డిమాండ్**



రాష్ట్ర జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీకి విద్యా, ఉద్యోగ అవకాశాల్లో తగిన ప్రాధాన్యత లభించాలంటే వారిని 'బీసీ-డి' గ్రూప్ నుండి 'బీసీ-ఏ'లోకి మార్చాల్సిందేనని కావలి ప్రభు ముదిరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ముదిరాజ్ సమాజంలోని పేద ప్రజలు విద్యా, ఉద్యోగ రంగాలలో తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి పాలనలోనే ముది రాజులను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చే ప్రక్రియ ప్రారంభమైందని గుర్తుచేశారు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ మార్పును అమలు చేయాలని కోరారు. రాబోయే కేబినెట్ సమావేశంలోనే దీనిపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభు ముదిరాజ్ కోరారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో ముదిరాజులకు మాత్రమే తీవ్ర అన్యాయం జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని ముదిరాజులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియను అడ్డుకోవడానికి ఎవరైనా కుట్రలు చేస్తే వారి యత్నాలను తిప్పికొడుతూ ఎంతటి నిరాహార దీక్షకైనా సిద్ధంగా ఉన్నానని ఆయన హెచ్చరించారు. ముదిరాజులందరూ ఐక్యంగా పోరాడి తమ హక్కు అయిన రిజర్వేషన్ సౌకర్యాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## వృద్ధుడిపై ట్రాఫిక్ పోలీసుల దురుసు ప్రవర్తన

**74 ఏళ్ల వృద్ధుడిని అసభ్య పదజాలంతో దూషించారంటూ ఆరోపణలు**
**వాహనం తాళం చెవి, సెల్‌ఫోన్ లాక్కున్నారని కుటుంబ సభ్యుడి ఆవేదన**
**మెట్టుగూడ చౌరస్తాలో ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని విజ్ఞప్తి**



ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. మెట్టుగూడ చౌరస్తాలో 74 ఏళ్ల వృద్ధుడితో చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఆర్ ఏఎస్ఐ ఎం. మహేందర్ అసభ్య పదజాలంతో మాట్లాడినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఓ యువకుడు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో పోలీసుల ప్రవర్తనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### వృద్ధుడితో అలా మాట్లాడటం సమంజసమేనా.?

యువకుడు వెల్లడించిన సమాచారం ప్రకారం, మెట్టుగూడ చౌరస్తాలో తన 74 ఏళ్ల తండ్రితో విధుల్లో ఉన్న ఏఆర్ ఏఎస్ఐ ఎం. మహేందర్ మాట్లాడిన తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని ఆరోపించాడు. పోలీసు అధికారి విధుల్లో ఉన్నప్పటికీ ప్రజలతో గౌరవంగా మాట్లాడటం కనీస బాధ్యత అని, ముఖ్యంగా వృద్ధుల పట్ల సంయమనం, మర్యాద పాటించాలని పేర్కొన్నాడు. తన తండ్రిని అసభ్య పదజాలంతో దూషించారని, వాహనం తాళం చెవి, సెల్‌ఫోన్‌ను లాక్కున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారులు స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరాడు.
అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వీడియో, పోలీసుల వివరణ, ఇతర ఆధారాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణల్లోని వాస్తవాలను విచారణ ద్వారా తేల్చాల్సిన అవసరం ఉంది.

### రాత్రివేళ ఆటోల్లో టిఫిన్ సెంటర్లు.. వసూళ్ల ఆరోపణలపై విచారణ ఏదీ.?

మరోవైపు, మెట్టుగూడ చౌరస్తా పరిసరాల్లో రాత్రి సమయాల్లో ఆటోల్లో టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని, ఒక్కో ఆటో నుంచి సుమారు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సహకారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

పోలీసుల విధుల్లో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యం. ట్రాఫిక్ నియంత్రణ పేరుతో ఎవరినీ అవమానించకూడదు. అదే సమయంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ ఆ చర్యలు నిబంధనలకు అనుగుణంగా, గౌరవప్రదంగా ఉండాలి.
మెట్టుగూడ ఘటనపై నగర ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు వీడియోను పరిశీలించి, వృద్ధుడి వాంగ్మూలాన్ని తీసుకుని, సంబంధిత పోలీసు అధికారి వివరణతో సహా అన్ని అంశాలను విచారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆటోల్లో టిఫిన్ సెంటర్ల నిర్వహణ, అనుమతులు, అక్రమ వసూళ్ల ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
ప్రజలకు సేవ చేయాల్సిన వ్యవస్థపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయడం కాకుండా పారదర్శకంగా విచారించి నిజానిజాలను వెల్లడించడమే ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది.



## రామ్‌చరణ్ – సుకుమార్ సినిమా.. పూజకు వేళాయెనే!

'పెద్ది' తరువాత తన తదుపరి చిత్రం కోసం సిద్ధమవుతున్నారు రామ్‌చరణ్ . 'రంగస్థలం' ఘనవిజయం తరువాత రామ్‌చరణ్ – సుకుమార్ కాంబోలో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాపై మరో అప్డేట్ ఇచ్చారు నిర్మాత రవిశంకర్. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న చిత్రాన్ని నవంబరు 1న పూజా కార్యక్రమాలతో ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సినిమాలో కథానాయిక పాత్ర కోసం పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నాయి.



## జోడీ కుదిరిందా!

కథానాయకుడు సాయిదుర్గా తేజ్ ఇటీవలే కొత్త చిత్రాన్ని ప్రకటించారు. తేజ కాకుమాను దర్శకత్వం వహించనున్న ఈ సినిమాని అనిల్ సుంకర నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది అటవీ నేపథ్యంతో ముడిపడిన యాక్షన్ డ్రామాగా రూపొందనుందని సమాచారం. విజువల్ ఎఫెక్ట్స్‌కి ఎంతో ప్రాధాన్యమున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు ఇందులో సాయితేజ్‌కి జోడీగా 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడని ఎంచుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ నెలాఖరు నుంచే చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఇక మరోవైపు సాయితేజ్ నటించిన 'సంబరాల ఏటి గట్టు' నిర్మాణానంతర పనుల్లో ఉండగా.. ఇది వచ్చే సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## అజిత్‌తో కయాదు?

ప్రముఖ కథానాయకుడు అజిత్ కుమార్‌కి జోడీగా కయాదు లోహర్ కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి సినీవర్గాలు. అగ్రతారల సరసన అవకాశాల్ని అందుకుంటూ వరుస సినిమాలతో జోరు మీదున్నారు కయాదు. ఇప్పుడామె ఖాతాలో మరో కొత్త చిత్రం చేరినట్లు తెలుస్తోంది. అజిత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'డేర్ డెవిల్'. అధిక్ రవిచంద్రన్ తెరకెక్కిస్తున్నారు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' విజయం తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న చిత్రమిది. ఇందులో కథానాయికగా శ్రీలీల నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. కొన్ని కారణాలతో ఇప్పుడామె స్థానంలో కయాదుని నాయికగా తీసుకుందట చిత్రబృందం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని కయాదు సన్నిహిత వర్గాలు తెలిపాయి.



## ఆకాశంలో మరో తార బిజిలీ

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం... 'ఆకాశంలో ఒక తార'. సాత్విక వీరవల్లి కథానాయిక. శ్రుతిహాసన్ కీలక పాత్రని పోషిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాతో కలిసి లైట్ బాక్స్ మీడియా పతాకంపై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్రంలోని మరో ముఖ్య పాత్రని పరిచయం చేస్తూ, లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం.బిజిలీ అనే ఆ పాత్రలో రుహానీ శర్మ నటిస్తున్నారు. అనుకోని సమయంలో కథలోకి ప్రవేశించి, అప్పటివరకూ సాగుతున్న ప్రయాణానికి ఓ కొత్త వెలుగుని తీసుకొచ్చే సహజమైన పాత్ర ఇదని, ప్రేక్షకులకు అందమైన అనుభూతిని పంచుతుందని సినీ వర్గాలు చెప్పాయి. ఓ పల్లెటూరి అమ్మాయి తన కలల్ని నిజం చేసుకునే ప్రయాణం, ఆమెకు అండగా నిలిచిన వ్యక్తుల కథతో ఈ చిత్రం రూపొందుతోంది. నవంబరు 20న తెలుగుతోపాటు తమిళ, హిందీ, మలయాళ భాషల్లో విడుదలకానుంది.

## 'జైలర్ 2'కు వసూళ్ల వర్షం.. త్వరలో రెండు రికార్డులు బద్దలు



సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఇందులో టైగర్ ముత్తువేల్ పాండియన్‌గా రజనీ మరోసారి తన అభినయంతో అదరగొట్టారు. 'జైలర్'కు సీక్వెల్‌గా నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం 10 రోజుల్లో రూ.666 కోట్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్ నటించిన '2.ఓ' ఇప్పటివరకూ అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రంగా (రూ.691 కోట్లు) ఉంది. 'జైలర్ 2' మరో రూ.25 కోట్లు సాధిస్తే, '2.ఓ' రికార్డును అధిగమించినట్లే. విజయ్ నటించిన 'లియో' రూ.605.9 కోట్లతో ఈ జాబితాలో మూడో స్థానంలో ఉంది. 2023లో వచ్చిన 'జైలర్' రూ.604.7 కోట్లు వసూలు చేసింది. సంస్కృతిని ప్లేట్లలో వెతక్కండి.. 'ఇదువు కాయితం' ట్రోల్స్‌పై వేణు ఊడుగులదమరోవైపు కేరళలో 'బాహుబలి 2' రికార్డును బద్దలుకొట్టే దిశగా 'జైలర్ 2' దూసుకెళ్తోంది. కేరళలో సుమారు రూ.70 కోట్లు సాధించడం ద్వారా ఆ రాష్ట్రంలో అత్యధిక వసూళ్లు చేసిన మలయాళేతర సినిమాగా 'బాహుబలి 2' నిలిచింది. త్వరలోనే 'జైలర్ 2' ఈ రికార్డును అధిగమించనున్నట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. 'జైలర్ 2'లో విలన్లుగా ఎస్.జె.సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, ప్రత్యేక పాత్రల్లో మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, హృతిక్ రోషన్, జాకీ ష్రాఫ్, విజయ్ సేతుపతి ప్రేక్షకులను అలరించారు.

## ఇలాంటి హారర్ సినిమా ఈ మధ్య రాలేదు



"థియేటర్లలో ప్రేక్షకులకు ఓ మంచి అనుభూతిని అందించాలన్న ఉద్దేశంతో చేసిన చిత్రమే '418" అన్నారు దర్శకుడు కీర్తన్ నాదగౌడ. దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో కీర్తన్ రూపొందించిన ఈ చిత్రంలో చైత్ర ఆచార్ ప్రధాన పాత్ర పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత వై.రవిశంకర్ మాట్లాడుతూ.. "అందరూ ఈ సినిమా చాలా బాగుందని చెప్తూనే.. సౌండ్ డిజైనింగ్ అద్భుతంగా ఉందని కొనియాడుతున్నారు" అన్నారు. దర్శకుడు కీర్తన్ మాట్లాడుతూ.. "సాంకేతికంగా సౌండ్, మ్యూజిక్, విజువల్స్‌ని దృష్టిలో పెట్టుకునే ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశాం. ప్రేక్షకులకు ఓ మంచి అనుభూతిని అందించే ఉద్దేశంతో ఈ చిత్రం చేశాం" అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ ఎర్నేని, శశిధర్ రెడ్డి, ప్రీతి పగడాల, హిరణ్మయి, చరణ్ లక్కరాజు, సంజన తదితరులు పాల్గొన్నారు.

### 'ఆర్‌సి 17'.. క్లాప్ కొట్టేది ఆ రోజే

కథానాయకుడు రామ్‌చరణ్ 17వ చిత్రం ఇప్పటికే ఖరారైంది. 'ఆర్‌సి 17' వర్కింగ్ టైటిల్‌తో సుకుమార్ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా నవంబరు 1న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాత వై.రవిశంకర్ శనివారం '418' చిత్ర వేడుకలో ప్రకటించారు. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి.

## 'రామాయణ' అడ్వాన్స్ బుకింగ్స్ అదరహో.. ఐమ్యాక్స్ టికెట్ ఎంతంటే!



రామాయణం ఆధారంగా సుమారు రూ.4 వేల కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ' . రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్ లాంటి ప్రముఖ తారాగణం నటించడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అమితాసక్తి నెలకొంది. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతున్న సంగతి తెలిసిందే. తొలి భాగం నవంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ వరల్డ్ స్థాయిలో, వేల స్క్రీన్లలో 'రామాయణ: ది రైజ్ ఆఫ్ లెజెండ్'ను విడుదల చేయడానికి నిర్మాత నమిత్ మల్హోత్రా సన్నాహాలు చేస్తున్నారు. నితీశ్ తివారీ తెరకెక్కించిన ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్‌లకు అనూహ్య స్పందన వస్తోంది. ఇప్పటికే 137 నగరాలు, పట్టణాల్లో 4,339 షోలకుగానూ 1.81 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోయానని, వీటిద్వారా రూ.10 కోట్లకు పైగా వసూళ్లు వచ్చాయని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

### ఐమ్యాక్స్‌లో హవా

భారీ విజువల్ హంగులతో తెరకెక్కిన 'రామాయణ'ను ఐమ్యాక్స్ థియేటర్లలో చూడటానికి ప్రేక్షకులు ఆస్తకి చూపుతున్నారు. అందుకే ఆ థియేటర్లలో టికెట్లకు ఎక్కువ డిమాండ్ ఉంది. ముంబయిలోని కొన్ని ఐమ్యాక్స్‌ల్లో రిక్లెయినర్ సీటు రూ.3,170 పలుకుతోంది. పీవీఆర్ ఐకాన్: ఫీనిక్స్ పల్లాడియంలో ఉదయం 7 గంటల షోకు రిక్లెయినర్ సీటు ధర రూ.1,850గా ఉంది. ఇప్పటికే ఈ షో హౌస్‌ఫుల్ కావడం గమనార్హం. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోని ఐమ్యాక్స్ త్రీడీ వెర్షన్లకు వీటి ధర రూ.1,550-2,400 మధ్య ఉంది.

# బహుముఖీన సాహితీ వేత్త ఆచార్య బండ సరోజన మృతి కి సంతాపం

బహుముఖీన సాహితీ వేత్త ఆచార్య బండ సరోజన ఇటీవలనే(గురు వారం)మృతి చెందారు తెలంగాణ అస్తిత్వం తో రచయిత్రిగా ఆరు దశాబ్దాలు విశేష కృషి చేసిన సరోజన మృతి పై సాహితీ వేత్తల స్పందన అంతగా లేదని విఖ్యాత కవి పద్మ భూషణ్ అవార్డ్ గ్రహీత బోయి భీమన్న సతీమణి ప్రముఖ గాయని హైమవతి భీమన్న ఆవేదన వ్యక్తం చేశారు

సరోజన సాహితీ కృషి నీ హైమవతి భీమన్న వివరించారు

విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఆచార్యురాలు, తెలుగు సాహిత్యానికి అంకితమైన రచయిత్రి, స్త్రీ విద్యాభ్యుదయానికి కృషి చేసిన పరిశోధకురాలు, ఆకాశవాణి కళాకారిణి డాక్టర్ బండ సరోజన గారు.ఆమె జీవితం విద్య, సాహిత్యం, సంస్కృతి, సామాజిక చైతన్యం, మహిళా సాధికారతల సమ్మేళనం. తన జ్ఞానాన్ని సమాజానికి పంచుతూ, అక్షరాన్ని ఆయుధంగా మలచుకున్న విశిష్ట వ్యక్తిత్వం ఆమెది.1941 ఏప్రిల్ 3న తెలంగాణలో బండ మల్లయ్య, బండ అంబమ్మ దంపతులకు జన్మించిన సరోజన గారు చిన్ననాటి నుంచే తెలుగు భాష, సాహిత్యం, జానపద కళలు, సంస్కృతి పట్ల మక్కువ పెంచుకున్నారు.తెలుగులో ఎం.ఏ., ఎం.ఎడ్., పిహెచ్.డి. పట్టాలను పొందిన ఆమె, ఆంధ్రప్రదేశ్ పాఠశాల పాఠ్యపుస్తకాలలో స్త్రీల హోదా, చిత్రణ అనే అంశంపై పరిశోధన చేశారు. స్త్రీలకు సముచిత స్థానం, సమాన అవకాశాలు, గౌరవం కల్పించడంలో విద్య పోషించే పాత్రను తన పరిశోధన ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు.ఆమె వృత్తిజీవితం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (రాజజు=ు), ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యా పథకం (ుూాజుూ), హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నతస్థాయి విద్యా అధ్యయన సంస్థ (×ూూజు)లతో ముడిపడి ఉంది. ఆచార్యురాలిగా, విద్యా పరిశోధకురాలిగా, పాఠ్యపుస్తక రచయిత్రిగా, సంపాదకురాలిగా, విషయ నిపుణురాలిగా విశేష సేవలందించారు.1994లో ఇంగ్లాండ్‌లోని లీడ్స్ విశ్వవిద్యాలయంలో పాఠ్యప్రణాళిక రూపకల్పన, పాఠ్యపుస్తక రచనలో ప్రత్యేక శిక్షణ పొందారు. అనంతరం ఆమె రచించిన ఒకటి, రెండవ తరగతుల తెలుగు వాచకాలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ప్రశంసలు పొందాయి. ఆ పాఠ్యపుస్తకాలు 1994 నుండి 2008 వరకు సుమారు పద్నాలుగు సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులకు ఉపయోగపడ్డాయి.పాఠశాల విద్యతో పాటు వయోజన విద్య, ఉపాధ్యాయ శిక్షణ, తెలుగు బోధనా పద్ధతుల అభివృద్ధికి ఆమె కృషి చేశారు. గోండు, సవర భాషలలో గిరిజన పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కూడా భాగస్వాములయ్యారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే ఆశయాన్ని ఆచరణలో చూపించారు.సాహిత్యరంగంలో డా. సరోజన గారిది బహుముఖ ప్రజ్ఞ. గేయం, పాట, కథ, నాటకం, వ్యాసం, ప్రసంగం, వాచక రచన వంటి అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. విద్యా సంబంధిత రచనలతో పాటు సాహిత్య రచనలు, అనేక గ్రంథాలు, వందలాది వ్యాసాలతో తెలుగు సాహిత్యానికి సేవలందించారు.ఆమె ప్రముఖ రచనలలో సప్తస్వరాలు, ఒక పువ్వు పూసింది, ఎర్రమందారం, అనంతవైభవం సావనీర్, లచ్చుమమ్మ ముచ్చట్లు, అక్షరమే ఆయుధం, ప్రకృతికే ఆభరణాలు, అక్షర రూపాలు, అలాగే ఆమె ఆత్మకథ సరోజం ముఖ్యమైనవి.ఆమె రచనలలో స్త్రీల జీవనానుభవాలు, సామాజిక చైతన్యం, మానవీయ విలువలు, విద్యా ప్రాధాన్యం, జానపద సంస్కృతి, అభ్యుదయ భావజాలం ప్రతిబింబించాయి.ఆకాశవాణి కళాకారిణిగా కూడా ఆమెకు విశిష్ట గుర్తింపు ఉంది. 1980ల నుండి ఆకాశవాణితో అనుబంధం కొనసాగిస్తూ నాటకాలు, ప్రసంగాలు, ముచ్చట్లు, చర్చలు, విద్యా కార్యక్రమాలలో పాల్గొన్నారు. బాలికల విద్య, స్త్రీ సాధికారత, అక్షరాస్యత, సామాజిక అభివృద్ధి వంటి అంశాలను ప్రజలకు చేరువ చేశారు. తరగతి గదికి పరిమితం కాని విద్యను రేడియో మాధ్యమం ద్వారా సమాజానికి అందించారు.విద్యా, సాహిత్య, సామాజిక రంగాలలో ఆమె చేసిన సేవలకు భారతదేశంలోనూ, అమెరికాలోనూ అనేక సన్మానాలు, పురస్కారాలు లభించాయి. ఉత్తమ విద్యావేత్తగా, ప్రతిభావంతమైన రచయిత్రిగా, విశిష్ట మహిళగా వివిధ సంస్థల గుర్తింపును పొందారు.ఆమె జీవితం కేవలం వ్యక్తిగత




విజయాల ప్రస్థానం కాదు. అది విద్య పట్ల అంకితభావానికి, సాహిత్యం పట్ల ప్రేమకు, మహిళల అభ్యున్నతి పట్ల నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం.ఆమె రాసిన అక్షరాలు పుస్తకాలలో నిలిచిపోతాయి. ఆమె బోధించిన పాఠాలు తరతరాలకు మార్గదర్శకమవుతాయి. ఆమె ఆశయాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి.డా. బండ సరోజన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె జ్ఞానం, రచనలు, సేవలు, విలువలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.విద్యకు అంకితమైన జీవితం. సాహిత్యానికి అర్పించిన కలం. స్త్రీ సాధికారతకు వినిపించిన గళం. కుటుంబానికి ప్రేమను పంచిన మాతృమూర్తి.ఆమె జీవితం ఒక ఆదర్శం. ఆమె అక్షరం ఒక శాశ్వత జ్ఞాపకం. ఆమె వారసత్వం చిరస్మరణీయం.

# పేరుపాలెం సెంటర్లో రహదారిపైనే దుకాణాలు!

- ప్రయాణికులు, స్థానికులకు తప్పని ఇబ్బందులు
- రహదారిపై ఆక్రమణలతో రాకపోకలకు అంతరాయం

మొగల్తూరు మండలంలోని పేరుపాలెం సెంటర్లో రహదారిపైనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై దుకాణాలు నిర్వహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
పేరుపాలెం సెంటర్ నిత్యం వాహనాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రహదారిపైనే దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రహదారి అందుబాటులో ఉన్న విస్తీర్ణం తగ్గి ప్రయాణికులు



ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.
రహదారులు ప్రయాణానికెనా.?
రహదారులు ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సి ఉండగా, వాటిపైనే దుకాణాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారాలు నిర్వహించుకోవడానికి అభ్యంతరం లేకపోయినా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.
అధికారులు స్పందించాలి!
పేరుపాలెం సెంటర్లో రహదారిపై దుకాణాల నిర్వహణతో ఏర్పడుతున్న సమస్యను సంబంధిత అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారులకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పేరుపాలెం సెంటర్లో రహదారిపై ఏర్పడుతున్న అడ్డంకులను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మాజీ మంత్రి విడదల రజిని ని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు

చిలకలూరిపేటలోని మాజీ మంత్రి విడదల రజిని నివాసానికి వైఎస్సార్‌సీపీ కి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు వెళ్లారు. వారిలో మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి విడదల రజని కలిసి పరామర్శించారు.



## బండి ముత్యాలమ్మను దర్శించుకున్న ప్రముఖ వ్యాపారవేత్త సత్తినేని తాతాజీ

మొగల్తూరు మండలం కొత్తట గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సత్తినేని తాతాజీ ముత్యాలపల్లిలో వెలసి యున్న శ్రీ శ్రీ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్థానికంగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



## :కనులపండువగా క్రిష్ణారెడ్డి దంపతులచే శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం...



మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాస కళ్యాణం భక్తుల భక్తి భావాల నడుమ కనులపండువగా ఒక వేడుకగా జరిగింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులతో పాటు వారి కుమారులు వేంకట మానస్ వేంకట ప్రణయ్ కుటుంబ సమేతంగా నిర్వహించిన ఈ కళ్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవంలో పాల్గొని, వీక్షించి భక్తి తన్మయత్వంలో పరవశించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా ఉత్సవ మూర్తులను కళ్యాణ మండపానికి తోడ్కొని వచ్చి స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమం మొత్తం భక్తి పారవశ్యంతో సాగి, భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, పుష్పాలతో అలంకరించిన మండపంలో కళ్యాణం జరిపారు. స్వామివారికి పల్లకీ సేవను చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కళ్యాణంలో భక్తులకు సకల వసతుల్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కళ్యాణ ఏర్పాట్లను నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షించారు. ఈ కళ్యాణం లో మెయిల్ సీఈఓ పురిటిపాటి వేంకట సుబ్బారెడ్డి, సుమలత దంపతులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జరిగిన వెల్దుర్తి మండల ఎంపీటీసీ నామినేషన్



వెల్దుర్తి మండల ఎంపీటీసీ నామినేషన్ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నాయకత్వం లో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా ముగిసింది. జూలకంటి అక్కిరెడ్డి, కుర్రి శివారెడ్డి, కళ్ళం రామాంజి రెడ్డి, సంజీవరెడ్డి, కాబోయే ఎంపీపీ దేశావత్ మల్లయ్య నాయక్ కి మండలంలోని ప్రతి ఒక్క గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు చాలా సహకరించారు. ఈ నామినేషన్ సందర్భంగా మండల ఆఫీసు నుండి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసం వరకు భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గొర్ల వారి పుట్టినరోజు వేడుకలు

### రుద్విక్ ను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అంజిబాబు





అనాకోడరు గ్రామంలో గొర్ల నాగరాజు మనవడు రుద్విక్ మొదటి పుట్టినరోజు వేడుకలలో ఆదివారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పాల్గొని రుద్విక్ కు ఆశీర్వాదాలు అందించి అక్షింతలు వేశారు. రుద్విక్ మొదటి పుట్టినరోజు సందర్భంగా 100 మంది మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రుద్విక్ ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాక్షించారు.

## చిట్టవరం ఎంపీటీసీ అభ్యర్థిగా ఉమాలక్ష్మి ఇంటింటా ప్రచారం



### ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం చిట్టవరం ఎంపీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున బుడితి శ్రీనివాస్ సతీమణి ఉమాలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు, నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆశీస్సులతో ఆమె ఎన్నికల బరిలో నిలిచారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. నామినేషన్ అనంతరం శనివారం ఆమె చిట్టవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు.

# నౌకా నిర్మాణంలో కొరియాతో భాగస్వామ్యానికి భారత్ అడుగులు

**కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ నాలుగు రోజుల దక్షిణ కొరియా పర్యటన ప్రారంభం**
**2047 నాటికి ప్రపంచంలో తొలి ఐదు నౌకా నిర్మాణ దేశాల్లో చోటే లక్ష్యం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
నౌకా నిర్మాణం, నౌకాయానం, ఓడరేవులు, సముద్ర రవాణా లాజిస్టిక్స్ రంగాల్లో భారత్--దక్షిణ కొరియా సహకారాన్ని మరింత విస్తరించే లక్ష్యంతో కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఆదివారం నాలుగు రోజుల దక్షిణ కొరియా పర్యటనను ప్రారంభించారు. భారత నౌకా నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను కొరియా పారిశ్రామిక వర్గాలకు వివరించనున్నారు.కొరియా సముద్ర పరిశ్రమకు ప్రధాన కేంద్రమైన బుసాన్‌లో తన పర్యటనను ప్రారంభించిన సోనోవాల్.. అక్కడి నౌకా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న భారతీయ నిపుణులతో సమావేశమయ్యారు. దక్షిణ కొరియాలో భారత రాయబారి గౌరంగలాల్ దాస్ స్వాగతం పలికిన ఈ సమావేశంలో శాంసంగ్ హెవీ ఇండస్ట్రీస్, హన్వా ఓషన్, హెచ్‌డీ హ్యుందాయ్, డీఎన్‌వీ, ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ తదితర సంస్థల్లో పనిచేస్తున్న భారతీయులు పాల్గొన్నారు.
ప్రపంచంలో అత్యాధునిక నౌకా నిర్మాణ వ్యవస్థల్లో ఒకటైన కొరియాలో భారతీయ నిపుణులు సేవలందించడం దేశానికి గర్వకారణమని సోనోవాల్ పేర్కొన్నారు. ఇరు దేశాల పరిశ్రమలు, నిపుణుల మధ్య అనుసంధాన వారధులుగా నిలవాలని పిలుపునిచ్చారు.



నౌకా నిర్మాణం, నౌకాయానం, సముద్ర రవాణా లాజిస్టిక్స్‌లో సహకారం కోసం ఇరు దేశాలు స్వీకరించిన 'వాయేజెస్' సహకార విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనిని ప్రభుత్వాల మధ్య ఒప్పందంగానే కాకుండా.. వృత్తిపరమైన ఎదుగుదలకు, భారత సముద్ర రంగ భవిష్యత్తుకు వేదికగా చూడాలన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'మారిటైమ్ ఇండియా విజన్--2030', 'మారిటైమ్ అమృత్‌కాల్ విజన్--2047'కు అనుగుణంగా.. నౌకా నిర్మాణం, మరమ్మతులు, సముద్ర రంగ తయారీ, లాజిస్టిక్స్‌లో భారత్‌ను ప్రపంచస్థాయి పోటీ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. 2047 నాటికి ప్రపంచంలోని తొలి ఐదు నౌకా నిర్మాణ దేశాల్లో భారత్‌ను నిలపడం లక్ష్యమని చెప్పారు.
ఈ లక్ష్యసాధనకు నౌకా నిర్మాణ నిపుణులు, మెరైన్ ఇంజినీర్లు, నేవల్ ఆర్కిటెక్టులు, డిజైనర్లు, వెల్డర్లు, ప్రాజెక్టు మేనేజర్లు, సాంకేతిక నిపుణులు మరింత మంది అవసరమవుతారని సోనోవాల్ వివరించారు. కొరియాలో పొందిన అనుభవాన్ని భారత్‌కు అందించాలని.. అక్కడి నుంచే భారతీయ సంస్థలకు సహకరించాలని కోరారు. యువ భారతీయ నిపుణులకు మార్గదర్శకత్వం అందించడంతోపాటు ఇండియా షిప్ టెక్నాలజీ సెంటర్, భారత్--కొరియా ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ నైపుణ్య భాగస్వామ్యంలో పాలుపంచుకోవాలని సూచించారు.
షిప్‌యార్డుల ఉత్పాదకత, ప్రాజెక్టుల అమలు మెరుగుదల, అంతర్జాతీయ స్థాయి నైపుణ్య సిబ్బంది తయారీ, సాంకేతికత--తయారీ--ఆవిష్కరణల్లో ఇరు దేశాల సహకారంపై నిపుణుల సూచనలను మంత్రి కోరారు.
పర్యటనలో భాగంగా అంతర్జాతీయ నౌకా నిర్మాణ సంస్థల ప్రతినిధులు, సముద్ర పరిశ్రమ సంఘాలు, పరిశోధనా సంస్థలతో సోనోవాల్ సమావేశం కానున్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా బుసాన్‌లో జరిగే మంత్రుల రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ పాల్గొననున్నారు. ఈ సమావేశానికి ప్రధాన సముద్ర వాణిజ్య దేశాల మంత్రులు, అంతర్జాతీయ సముద్ర సంస్థ సెక్రటరీ జనరల్ హాజరయ్యే అవకాశం ఉంది.

# వాకీటాకీల తప్పుదారి పట్టించే ప్రకటనలపై సీసీపీఏ కొరడా

**హోగర్ టెక్నాలజీస్‌కు రూ.లక్ష జరిమానా.. 12 సంస్థలపై మొత్తం రూ.58 లక్షల పెనాల్టీలు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
వాకీటాకీల విక్రయాల్లో కీలక నియంత్రణ వివరాలను వెల్లడించకుండా వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్న సంస్థలపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) చర్యలు ముమ్మరం చేసింది. ఆపరేటింగ్ ఫ్రీక్వెన్సీలు, లైసెన్సింగ్ నిబంధనలను స్పష్టంగా తెలియజేయకుండా ప్రకటనలు ఇచ్చిన హోగర్ టెక్నాలజీస్ అండ్ ఇన్నోవేషన్స్ ఎల్ఎల్‌పీపై రూ.లక్ష జరిమానా విధించింది. సీసీపీఏ చీఫ్ కమిషనర్ నిధి ఖరే, కమిషనర్ అనుపమ్ మిశ్రా నేతృత్వంలో వినియోగదారుల పరిరక్షణ చట్టం--2019 కింద ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి.హోగర్ సంస్థ వెబ్‌సైట్‌లో ప్రదర్శించిన వివిధ వాకీటాకీ మోడళ్ల ప్రకటనలు, ఉత్పత్తుల వివరాలను పరిశీలించగా.. వాటి వినియోగానికి వర్తించే ఫ్రీక్వెన్సీలు, లైసెన్సులు, నియంత్రణ అనుమతులపై తగిన సమాచారం లేదని సీసీపీఏ గుర్తించింది. దీంతో అవసరమైన అనుమతులు లేకుండానే పరికరాలను చట్టబద్ధంగా ఉపయోగించవచ్చనే అపోహ వినియోగదారుల్లో ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.తమ వద్ద చెల్లుబాటయ్యే డీలర్ పొసెసింగ్ లైసెన్స్, పరికరాలకు ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ ధ్రువీకరణలు ఉన్నాయని సంస్థ వాదించింది. తమ వెబ్‌సైట్ సమాచారం అందించేందుకు, వ్యాపార విచారణలు స్వీకరించేందుకు మాత్రమే ఉద్దేశించిందని, నేరుగా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించడం లేదని తెలిపింది. అయితే అనుమతులు కలిగి ఉన్నంత మాత్రాన కొనుగోలుకు ముందు వినియోగదారులకు పూర్తి సమాచారం అందించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేరని సీసీపీఏ స్పష్టం చేసింది. పేమెంట్ సదుపాయం లేకున్నా ప్రకటనలకు నిబంధనలు వర్తిస్తాయివెబ్‌సైట్‌లో పేమెంట్ గేట్‌వే లేదా షాపింగ్ కార్ట్ లేకపోయినా.. అందులోని ఉత్పత్తుల ప్రచారం వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకే వస్తుందని ప్రాధికార సంస్థ తేల్చిచెప్పింది. ఉత్పత్తిని ఏ విధానంలో విక్రయించినా, దాని చట్టబద్ధ వినియోగానికి అవసరమైన వివరాలను ప్రకటనల్లో వెల్లడించాలని సూచించింది. 2018 నాటి సంబంధిత నిబంధనల ప్రకారం 446.0--446.2 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ పరిధిలో పనిచేసే పర్సనల్ మొబైల్ రేడియోలకు నిర్దేశిత షరతులకు లోబడి లైసెన్స్ మినహాయింపు ఉంటుంది. ఆ పరిధికి వెలుపల పనిచేసే పరికరాలకు సంబంధిత నియంత్రణ నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. 16,970కిపైగా నిబంధనలకు విరుద్ధమైన లిస్టింగులు గుర్తింపుఆన్‌లైన్ వేదికల్లో తప్పనిసరి నియంత్రణ వివరాలు లేకుండా వాకీటాకీలను విక్రయిస్తున్న వ్యవహారాన్ని సీసీపీఏ సుమోటోగా పరిశీలించింది. వివిధ ప్లాట్‌ఫామ్‌లలో 16,970కిపైగా నిబంధనలకు విరుద్ధమైన లిస్టింగులను గుర్తించి, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, మెటా, జియోమార్ట్, ఇండియామార్ట్, ట్రేడ్‌ఇండియా తదితర 13 ఈ--కామర్స్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది.ఇప్పటివరకు 12 సంస్థలపై తుది ఉత్తర్వులు జారీ చేసి, మొత్తం రూ.58 లక్షల జరిమానాలు విధించినట్లు సీసీపీఏ వెల్లడించింది. వీటిలో కొన్ని సంస్థలు ఉత్తర్వులు, విచారణ ప్రక్రియలను న్యాయ వేదికల్లో సవాలు చేశాయని తెలిపింది.వాకీటాకీల ప్రకటనల్లో ఆపరేటింగ్ ఫ్రీక్వెన్సీలు, వర్తించే లైసెన్సింగ్ అవసరాలు, ఇతర ముఖ్యమైన నియంత్రణ సమాచారాన్ని స్పష్టంగా పొందుపరచాలని సీసీపీఏ పునరుద్ఘాటించింది. వివరాలను దాచిపెట్టడం వల్ల వినియోగదారులు చట్టపరమైన, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, అనుచిత వ్యాపార పద్ధతుల నియంత్రణకు చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

# కొరియా పెట్టుబడులకు తెలంగాణలో విస్తృత అవకాశాలు

**కొరియాతో సాంస్కృతిక, ఆర్థిక బంధాలకు తెలంగాణ సర్కారు ప్రాధాన్యం**
**ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి ప్రాధాన్యం**
**ఐదేళ్లలో పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం**
**మూడు లక్షల అదనపు ఉద్యోగాల కల్పనకు ప్రణాళిక**
**27 పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ**
**ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం**
**కొరియా సంస్థలతో భాగస్వామ్యాన్ని విస్తరిస్తాం**
**కె హార్మనీ ఫెస్టా -- కొరియా సాంస్కృతిక దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
కొరియా సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, యువత నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కొరియా సంస్థలతో కలిసి పనిచేసేందుకు తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన కె హార్మనీ ఫెస్టా--కొరియా కల్చర్ డే 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ కొరియాలో చేపట్టిన పర్యటన సందర్భంగా జరిగిన పెట్టుబడుల చర్చలు రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి పునాది వేశాయని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొరియా ఆర్థిక ప్రగతి నుంచి తెలంగాణ నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతికతపై నిరంతర పెట్టుబడులు అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు.
పరిశ్రమలతో పాటు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. పర్యాటక రంగంలోనూ కొరియా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025--2030 ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పర్యాటక మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగం, చలనచిత్ర పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, సాంస్కృతిక అనుభవాల అభివృద్ధిలో కొరియా సంస్థల భాగస్వామ్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

## భారత్--కొరియా మధ్య సాంస్కృతిక బంధం

కొరియా సంస్కృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుక రెండు దేశాల ప్రజల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.
యుద్ధం, పేదరికం వంటి సవాళ్లను అధిగమించి కొరియా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని కొనియాడారు. సాంకేతికత, తయారీ, విద్య, ఆవిష్కరణల్లో ఆ దేశం సాధించిన విజయాలు ప్రశంసనీయమన్నారు. కొరియన్ సంగీతం, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకర్షిస్తున్నాయని, సాంస్కృతిక ప్రభావం కూడా ఒక దేశ అంతర్జాతీయ గుర్తింపును పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భారత్, కొరియా ప్రజల మధ్య విద్య, కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాల్లో సారూప్యతలు ఉన్నాయని తెలిపారు. ప్రాచీన భారతదేశం నుంచి కొరియాకు వెళ్లినట్లు విశ్వసించే రాణి హియో హ్వాంగ్-ఓక్ గాథ రెండు దేశాల మధ్య చారిత్రక స్నేహానికి ప్రతీకగా




నిలిచిందన్నారు.

## తెలంగాణ వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపు

విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాల కలయికకు హైదరాబాద్ శతాబ్దాలుగా కేంద్రంగా నిలిచిందని చెప్పారు. బతుకమ్మ, బోనాలు, తెలుగు సాంస్కృతిక వారసత్వం, చారిత్రక కట్టడాలు తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు. చార్మినార్, గోల్కొండ కోట, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం సహా రాష్ట్రంలో అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలు భారత్, తూర్పు ఆసియా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయగలవని అన్నారు. కొరియా పర్యాటకులు తెలంగాణను సందర్శించాలని, ఇరు ప్రాంతాల యువత చదువు, పరిశోధన, ఉద్యోగాలు, సృజనాత్మక రంగాల్లో పరస్పరం అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య ఒప్పందాలు ముఖ్యమైనప్పటికీ, ప్రజల మధ్య ఆప్యాయత, పరస్పర అవగాహనే సంబంధాలకు శాశ్వత పునాది అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ కొరియా మిత్రులకు మరో ఇల్లు వంటిదని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు భారతదేశంలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబారి హెచ్.ఈ. లీ సియుంగ్-హో స్వాగతం పలికారు.

# 'ఆపరేషన్ ట్రైడెంట్'తో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు భారీ దెబ్బ

**38 ప్రాంతాల్లో ఏకకాల దాడులు.. 18 మంది అరెస్ట్**
**రూ.100 కోట్ల హవాలా లావాదేవీలు వెలుగులోకి.. 1,424 బ్యాంకు ఖాతాల స్తంభన**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ట్రైడెంట్'లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టురట్టయింది. అక్టోబర్ 23న అసోం, మిజోరం, మణిపూర్ రాష్ట్రాల్లోని 38 ప్రాంతాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఆయా రాష్ట్రాల పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ చర్యల్లో 18 మందిని అరెస్టు చేశారు.
దర్యాప్తులో రూ.100 కోట్ల విలువైన హవాలా లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. ముఠాతో సంబంధమున్న 1,424 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతోపాటు రూ.17.82 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. దాడుల్లో 500 డిటోనేటర్లు, రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.
భారత్, మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దుల మీదుగా 'డెత్ ట్రయాంగిల్ కారిడార్' ద్వారా ఈ నెట్‌వర్క్ మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. మూడు రాష్ట్రాల్లో సమన్వయంతో చేపట్టిన ఈ ఆపరేషన్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల రవాణా వ్యవస్థకు గట్టి దెబ్బగా నిలిచింది.
2029 డిసెంబర్ 31 నాటికి మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లను నిర్మూలించాలన్న లక్ష్యానికి ఈ చర్య బలాన్ని చేకూర్చిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. చివరి డ్రగ్స్ ముఠాను అంతం చేసే వరకు చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఆపరేషన్‌లో పాల్గొన్న కేంద్ర సంస్థలు, మూడు రాష్ట్రాల పోలీసులతో కూడిన మాదకద్రవ్యాల నిరోధక బృందాన్ని అభినందించింది.

# అక్టోబర్ 30న జనసేన తెలంగాణ 'అలయ్ బలయ్'

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**
జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో అక్టోబర్ 30, శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 'జనసేన తెలంగాణ అలయ్ బలయ్' ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వ స్ఫూర్తితో, తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.
పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మండల స్థాయి నాయకులు పాల్గొననున్నారు. నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు ఆత్మీయ అనుబంధం, పరస్పర విశ్వాసం, సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేయడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశం. తెలంగాణ ఆకాంక్షలు, యువత భవిష్యత్తు, విద్య, ఉపాధి, ప్రజారోగ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఉమ్మడి అవగాహన పెంపొందిస్తూ, ప్రజాసేవలో సమిష్టిగా ముందుకు సాగేందుకు ఈ కార్యక్రమం వేదిక కానుంది.

# సింగరేణిని మరింత బలోపేతం చేస్తాం

**-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**



సింగరేణిని మరింత బలోపేతం చేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. సింగరేణి అభివృద్ధి, సంస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై తాము ప్రత్యేకంగా దృష్టిసారించామని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో సింగరేణి జనరల్ మేనేజర్లతో భట్టి విక్రమార్క ఈరోజు (ఆదివారం) ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి చరిత్రలో జీఎంలతో ప్రత్యక్ష సమీక్షా కార్యక్రమం కీలక సమావేశంగా నిలవనుంది. సింగరేణి సీఎండీ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి అధ్యక్షతన ఈ సమావేశం జరగుతోంది. సింగరేణిలోని మొత్తం 66 మంది జనరల్ మేనేజర్లతో సంస్థ పనితీరుపై ప్రత్యక్ష చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి సాధించిన ప్రగతిని అధికారులు వివరించారు. జనరల్ మేనేజర్ల విధులు, బాధ్యతలు, క్షేత్రస్థాయి పనితీరుపై ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, సాధించిన ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. బొగ్గు రవాణా, రేకుల లభ్యత, డిస్పాచ్ వివరాల గురించి మాట్లాడారు. ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనుల్లో ఉత్పత్తి పరిస్థితులపై సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి పెంపు, రవాణా వేగవంతం, లక్ష్యాల సాధనపై అధికారులతో చర్చించారు. సింగరేణి భవిష్యత్ విస్తరణ, కొత్త గనుల అభివృద్ధి ప్రణాళికలపై సమాలోచనలు చేశారు. సంస్థ ఉత్పాదకత, సామర్థ్యం పెంపు, కార్యాచరణ మెరుగుదలపై భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలి: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**తమిళనాడులో 'ఓట్ బచావో -- దేశ్ బచావో -- సీఈసీ హటావో' కార్యక్రమంలో పాల్గొన్న బల్మూరి వెంకట్**

**చెన్నై, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:**



ఏఐసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఓట్ బచావో -- దేశ్ బచావో -- సీఈసీ హటావో' నిరసన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఈ రోజు తమిళనాడులో పర్యటించారు. ఈ సందర్భంగా టీఎన్‌సీసీ అబ్జర్వర్ కిజ్జనూర్ రాజేంద్రన్, డీసీసీ అధ్యక్షులతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాల నుంచి ప్రజల పేర్లను తొలగిస్తున్నారని, ఈ వ్యవహారంపై ప్రశ్నించే వారిపట్ల కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన పౌరుడికి తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఓటు హక్కును కాపాడుకోవడం, ఓటర్ల జాబితాల్లో అక్రమంగా పేర్లు తొలగించబడిన వారికి న్యాయం జరిగేలా చూడడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడిన వారిని నేరుగా కలిసి, వారి వివరాలను పరిశీలించి, తిరిగి ఓటు నమోదు చేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు వెల్లడించారు.
ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక




# శాస్త్రీయ నృత్యాలతో మురిసిన గాన సభ





**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 25:** నాట్య గురువులు రేవతి ప్రశాంత్ రచ్చ నరేష్ జాహ్నవి,శ్రీవాణి ల వందకు పైగా శిష్య బృందం శాస్త్రీయ నృత్య అంశాల ప్రదర్శన తో శ్రీ త్యాగరాయ గానసభ మువ్వల సవ్వడి తో మురిసింది వైష్ణవి ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో దేవీ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని నవ శక్తి కళా పురస్కార ప్రదానం సభ జరిగింది ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్ పాల్గొని నాట్య గురువు లకు పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగిసినా శక్తి స్వరూపం శాశ్వతం గా నిలిచి ఉంటుంది అన్నారు శక్తి ఆరాధన తప్పని సరిగా ప్రతి ఒక్కరూ చేయాలి నాట్య కళాకారిణి లు శక్తి ఉపాసన నర్తనం లో ఉంటుందని చెప్పారు సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ తమ శుభాకాంక్షలు తెలిపారు సంస్థ నిర్వాహకులు




ధనరాజ్ రాజేష్ కార్యక్రమ నిర్వహణ చేశారు




# ట్రైనెట్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...

**"విశ్రాంతి లేని డబ్బు సంపాదన ఆరోగ్యానికి ప్రమాదం. డబ్బు లేని విశ్రాంతి జీవితానికే ప్రమాదం" .**
**మనీ(డబ్బు) లోనె ఉందిరా మోహమన్నది...**
**డబ్బు లేక కుదరదు ఏ జబ్బు అన్నది**




నిజమే డబ్బు అవసరమే. నేడు ఆధునిక మానవ జీవితం పూర్తిగా డబ్బు చుట్టూనే తిరుగుతున్నది. మనిషి ...జీవన ప్రమాణాల మెరుగు కోసం, సమాజంలో హోదా కోసం ,పిల్లల భవిష్యత్తు కోసం పగలు రాత్రి తేడా లేకుండా శ్రమిస్తూనే ఉన్నాడు. అయితే ఈ పరుగు పందెంలో తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. కేవలం సంపాదన వెనక పరిగెడుతూ ఉంటే ,విశ్రాంతి లేకుంటే శరీరం మనసు ఎంతవరకు దెబ్బతింటాయో అన్నది ప్రతి మనిషి ఆలోచించాల్సిన విషయం. ఎంత డబ్బు ఉన్నా అనుభవించడానికి ఆరోగ్యం లేకపోతే ఆ సంపాదన నిరర్థకం. ఈనాడు ఈ ఆధునిక యుగంలో కార్పొరేట్ ఉద్యోగాలు, వ్యాపారాల వలన సమయపాలన కరువైంది. 10 నుండి 12 గంటల వరకు నిరంతరం పనిచేయాల్సి ఉంటున్నది. పని ఒత్తిడి, నిద్రలేమి వంటివి జీవితంలో భాగం అయిపోయాయి. కేవలం డబ్బు సంపాదన మీదే దృష్టి పెట్టడం వల్ల శరీరం మీద విపరీతమైన ఒత్తిడి పెరిగిపోతున్నది. వీటివల్ల గుండె జబ్బులు, రక్తపోటు పెరిగి వయసు తేడా లేకుండా చిన్న వయసులోనే గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా పెరుగుతున్నది. మానసిక అలసటతో చిరాకు, డిప్రెషన్ వంటివి కూడా పెరిగిపోతున్నాయి. సమయానికి సరైన ఆహారం లేకపోవడం, నిద్ర లేకపోవడం వలన ఊబకాయం, మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాల బారిన కూడా పడుతున్నారు. పైగా డబ్బు సంపాదన పిచ్చిలో పడి బంధాలకు కూడా దూరమవుతున్నారు. భార్యాభర్తల మధ్య దూరం, తల్లిదండ్రులకి పిల్లలకి మధ్య దూరం, బంధాలు.... అనుబంధాలకు దూరం పెరిగిపోతున్నాయి. కలకాలం కలిసి మెలిసి ఉండవలసిన భార్య భర్తల మధ్య కూడా దూరం పెరిగిపోయి తప్పుడు స్నేహాలు, తప్పుడు బంధాలు ఏర్పడుతున్నాయి. పిల్లలతో దూరం పెరిగినందువల్ల ,వారి అలవాట్లు వారు ఏ దారులలో వెళ్తున్నారు, ఎటువంటి వారితో స్నేహం చేస్తున్నారు, చదువు సంధ్య పట్ల ఎటువంటి శ్రద్ధ వహిస్తున్నారు అనే అవగాహన తగ్గిపోయి ఎంతో భవిష్యత్తు ఉన్న పిల్లలు సమాజంలో చీడపురుగులుగా తయారవుతున్నారు.నేటి బాలలే రేపటి పౌరులు అన్న విషయం మరుగున పడిపోయి, బంగారు భవిష్యత్తు ఉన్న చిన్నారులు రౌడీలుగా గుండాలుగా పనికిరాని వారిగా తయారవుతున్నారు. వారి జీవితం వ్యర్థమవుతూ ఉన్నది. ఈ సమస్య అనుకున్నంత చిన్నది కాదు చాలా పెద్ద సమస్య .

అలాగే డబ్బు లేని విశ్రాంతి కూడా జీవితానికే ప్రమాదం .కేవలం ఆరోగ్యం బాగుంటే సరిపోదు. సమాజంలో జీవించాలంటే ప్రతి మనిషికి ఆర్థిక స్థిరత్వం చాలా అవసరం. ఏ పని చేయకుండా సంపాదన లేకుండా కేవలం విశ్రాంతి కోరుకుంటే ఆ జీవితం వ్యర్థం, దుర్భరం. నేటి సమాజంలో ఏది ఉచితంగా లభించదు. గాలి వెలుతురు నీరు వంటివి కూడా ఈ రోజుల్లో కొనుక్కోవాల్సి వస్తున్నది. కనీస అవసరాలు అయిన కూడు, గుడ్డ, నీడ కావాలన్నా డబ్బు కావాలి. ఏ పని చేయకుండా పడుకుంటే సమాజంలో గౌరవం పోగొట్టుకోవడం ,మనిషి అప్పులకు పాలు కావటం, సంసారం చిన్నాభిన్నం కావటం తథ్యం. ఏ పని చేయకుండా బ్రతికితే ఎదురుగా ఏమీ అనలేకపోయినా మన వెనుక నైనా విమర్శిస్తారు ఎగతాళి చేస్తారు. డబ్బు లేకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో చాలా సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది డబ్బు లేని పక్షంలో సరైన వైద్యం అందక ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుంది. ఒక్కోసారి పరిస్థితి చేయి దాటితే మనుషులను పోగొట్టుకోవడమే కాక, మన ప్రాణాలను కూడా పోగొట్టుకుంటాము. మన ఆర్థిక పరిస్థితి సరిగా లేకుంటే పిల్లలకు సరైన విద్యా వసతులు కల్పించలేక ,వారి భవిష్యత్తు కూడా సర్వనాశనం చేస్తాము. ఆలోచించండి పనికిరాని పుట్టుక అవసరమా. మన జీవితమే దండగ అనుకుంటే మనం పెళ్లి చేసుకొని పిల్లల్ని కని ,వారి

జీవితాలను కూడా పణంగా పెట్టి నిట్ట నిలువునా నాశనం చేస్తున్నాము. అనారోగ్యం పాలు కావటం మాత్రమే కాదు, సమాజం కుటుంబం తక్కువగా చూసినప్పుడు, హేళన చేసినప్పుడు ఆత్మ న్యూనతా భావం పెరిగిపోయి, మనిషిని ఆత్మహత్యల వైపు ప్రేరేపించే ప్రమాదం కూడా ఉంది.

కనుక మిత్రులారా కేవలం డబ్బు వెనకాలే పరిగెత్తకూడదు. అలాగని సంపాదనను వదిలేసి సోమరిగా విశ్రాంతి తీసుకోకూడదు." ఔశీతీఎబి శ్రీఱటవ ఝశ్రీఖఅఎవ". అనేది పాటించాలి. అప్పుడే జీవితం అర్థవంతంగా, సుఖమయంగా సాగుతుంది.

శుభోదయం.. శశిబాల

# విద్యతోనే ఉన్నత భవిష్యత్తు





**ఎస్సీ వర్గీకరణ ఫలాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్ల చంద్ర స్వామి మాదిగ**

**ఆత్మకూరు(ఎం), ట్రైనెట్ న్యూస్:** విద్యతోనే భవిష్యత్తు ఉన్నతంగా మారుతుందని, ప్రతి మాదిగ విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన కమిటీల ఎన్నిక సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ, మండల స్థాయిలో ఎంఎస్ఎఫ్ కమిటీల నిర్మాణంలో భాగంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఎస్పీ మండల అధ్యక్షులు జిట్టా యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గురుకు యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ.. మాదిగ జాతి అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మంద కృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటంతో ఎస్సీ వర్గీకరణ సాధించారని పేర్కొన్నారు. ఆ ఫలాలు మాదిగ, ఉపకులాల విద్యార్థులకు అందాలంటే ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థులెవరూ మధ్యలో చదువు మానేయవద్దని, విద్యాసంస్థల్లో సమస్యలు ఎదురైతే ఎంఎస్ఎఫ్ కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఎంఎస్ఎఫ్ బాలుర, బాలికల నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

బాలుర కమిటీ: అధ్యక్షుడిగా బూడిద పవన్ మాదిగ, అధికార ప్రతినిధిగా గురుకు జశ్వంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బూడిద మనోజ్ కుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా గాదె క్రాంతి మాదిగ, కార్యదర్శిగా జిట్టా శ్రీమంజునాథ మాదిగ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గంధమల తనుష్ మాదిగ, గురుకు జయాంశ్ మాదిగ, బూడిద విశాల్ మాదిగ, గంధమల తేజ మాదిగ, చింతల ఫన్నీ మాదిగ ఎన్నికయ్యారు.

బాలికల కమిటీ: అధ్యక్షురాలిగా బూడిద లోకేశ్వరి మాదిగ, అధికార ప్రతినిధిగా జిట్టా ఛాయశ్రీ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బూడిద భవిత మాదిగ, ఉపాధ్యక్షురాలిగా బూడిద స్నేహ మాదిగ, కార్యదర్శిగా జిట్టా యమునాశ్రీ మాదిగ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గంధమల ధనలక్ష్మి మాదిగ, గురుకు సంహిత మాదిగ, బూడిద లోహిత మాదిగ, గంధమల జాను మాదిగ ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో బూడిద ఆంజనేయులు మాదిగ, మండల నాయకులు బూడిద నర్సింహ్మా మాదిగ, గురుకు విజయ్ మాదిగ, బూడిద విజయ్ మాదిగ, పత్తెపురం వంశీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రాగ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ 'శక్తి పురస్కార్' వేడుకలు




**ఆకట్టుకున్న విద్యార్థుల సంగీత, నృత్య ప్రదర్శనలు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 25:** విద్యతో పాటు కళల్లోనూ విద్యార్థులు రాణించాలని ఏ.టి. శంకర్ రామన్, డీసీపీ సుంకర సత్యనారాయణ సూచించారు. రాగ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన 27వ గ్రాండ్ ఈవెంట్ 'శక్తి పురస్కార్--రాగ రంజని' కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సినీ సంగీతం, శాస్త్రీయ నృత్యం, తబలా విన్యాసాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తంజావూరు జిల్లా సాంస్కృతిక విభాగ కార్యదర్శి ఏ.టి. శంకర్ రామన్, డీసీపీ సుంకర సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. శాస్త్రీయ నృత్యాభ్యాసం ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అలవడతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు సృజనాత్మక రంగాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

యువతలో కళాత్మక ప్రతిభను వెలికితీస్తూ, భారతీయ కళా సంప్రదాయాల పరిరక్షణకు అకాడమీ చేస్తున్న కృషిని అతిథులు ప్రశంసించారు. యువ కళాకారులను తీర్చిదిద్దడంతో పాటు వారి ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక కల్పించడం అభినందనీయమన్నారు.

అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల ప్రదర్శనలకు ప్రేక్షకులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. సంగీతం, నృత్యం, లయ సమ్మేళనంగా సాగిన వేడుక ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.


edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136